

కలెక్టర్‌కు జీవీఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు



హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు జీవీఎంసీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేస్తున్న పి.సంపత్‌కుమార్‌ను సోమవారం కమిషనర్ అండ్ డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌గా బదిలీచేసిన విషయం తెలిసిందే. సంపత్ కుమార్ స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

పార్టీ పురోభివృద్ధికి కలిసికట్టుగా కృషి

- 24 గంటలు అందరికీ అందుబాటులో ఉంటా
- విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు ఎం.పరశురామరాజు



అధ్యక్షునిగా ఎన్నికైన పరశురామరాజును సత్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, సెయిల్ డైరెక్టర్ కాశీ రాజు తదితరులు

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): **పార్టీ పురోభివృద్ధికి అందరితో కలిసి పనిచేస్తానని, 24 గంటలూ అందుబాటులో ఉంటానని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన మంతెన మురళీ నాగ పరశురామ రాజు తెలిపారు.**

లాసన్స్ బే కాలనీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీ అధ్యక్షునిగా ఎన్నికైనట్టు పరిశీలకులు ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పరశురామరాజు మాట్లాడుతూ, బీజేపీకి విశాఖపట్నం చాలా కీలకమైన నగరమన్నారు. తనపై నమ్మకంతో అప్ప గించిన ఈ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ పరశురామరాజు గతంలో పశ్చిమ గోదావరి జిల్లా పార్టీ ఇన్‌చార్జిగా, అనకాపల్లి జిల్లా ఎన్నికల పరిశీలకునిగా, అరకు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా, రాష్ట్ర భవన నిర్మాణ కాంట్రాక్టర్ల సంఘం సభ్యునిగా ఉన్నారన్నారు. లాసన్స్‌బేలో పార్టీ కార్యాలయం స్థలం కోసం కృషి చేసిన వారిలో ఆయన కూడా ఒకరని గుర్తు చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెయిల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు మాట్లాడుతూ, ఈ అధ్యక్ష పదవి కోసం ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారని, అన్నీ పరిశీలించి అధిష్ఠానం పరశురామరాజుకు అవకాశం కల్పించిందన్నారు. ఇది పదవి కాదని, బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్ని పరశురామరాజును సన్మానించారు.

చలికి నగరం గజగజ



- ఎయిర్‌పోర్టులో 14.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది నుంచి పొడి గాలులు వీస్తుండడంతో నగరంలో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. నగరం కంటే శివారు ప్రాంతాల్లో మరింత ఎక్కువగా ఉంటోంది. ఎయిర్‌పోర్టులో మంగళవారం 14.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే ఐదు డిగ్రీలు తక్కువ. ఈ సీజన్‌లో ఇదే అత్యల్ప ఉష్ణోగ్రతగా విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం అధికారి జగన్నాథ్‌కుమార్ తెలిపారు. బుధవారం కూడా చలి తీవ్రత కొనసాగుతుందని, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు అటు,ఇటుగా నమోదు కావచ్చునని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో కొనసాగుతున్న అధిక పీడనం నుంచి చలి గాలులు ఒడిశా మీదుగా ఉత్తర కోస్తా జిల్లాల వరకు విస్తరించాయి. అదే సమయంలో సముద్రం మీద నుంచి తేమగాలులు వీయకపోవడం, ఆకాశం నిర్మలంగా ఉండడం చలి పెరగానికి కారణాలుగా వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

సహకారం... ఇరకాటం

పదిహేనేళ్ల క్రితం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ స్థలాన్ని 33 ఏళ్లకు లీజుకు తీసుకున్న ముంబై వ్యాపారులు

- రూ.350 కోట్ల రుణం కోసం బ్యాంకులో తనఖా
- ష్యూరిటీ సంతకాలు పెట్టిన సహకార అధికారులు
- ఆ సంస్థ చేతులెత్తేయడంతో బకాయి చెల్లించాలంటూ నోటీసులు ఇచ్చిన ముంబై బ్యాంకు
- రూ.129.62 కోట్లు రావలసి ఉందంటూ లెక్కలు
- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం



లీజు స్థలంలో నిర్మించిన షాపింగ్ మాల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్ అధికారులు... ముంబై వ్యాపారులతో కుమ్మక్కై ఇప్పుడు పీకల్లోతు కష్టాల్లో చిక్కుకున్నారు. కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ భూమిని లీజుకు తీసుకున్న ముంబై వ్యాపారి...దానిని తనఖా పెట్టి బ్యాంకులో రూ.350 కోట్ల రుణం తీసుకున్నాడు. అందులో కొంత చెల్లించి మిగిలిన మొత్తం చెల్లించలేక చేతులెత్తేశాడు. దాంతో ఆ బ్యాంకు ష్యూరిటీ సంతకం చేసిన ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చింది. దీంతో జిల్లా అధికారులు, సహకార శాఖ సిబ్బంది కక్కలేక మింగలేక అల్లాడిపోతున్నారు.

ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్ అనేది ప్రభుత్వ సహకార సంస్థ విభాగం. వీరికి వైశాఖి జల ఉద్యానవనం పక్కన భారీ స్థలం ఉంది. అందులో సూపర్ బజార్ నడుపుతున్నారు. భవనంలో కొంత భాగం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఫర్నీచర్ దుకాణానికి అద్దెకు ఇచ్చారు. అదే ఆవరణలో 3,972 చ.గజాల స్థలం ఖాళీగా ఉండడంతో పదేళ్ల కిందట ముంబైకు చెందిన సుహాని ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కన్సల్టెంట్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థకు 33 ఏళ్ల లీజుకు ఇచ్చారు. ఆ సంస్థ ఇప్పుడు పేరు మార్చుకొని ఫ్యూచర్ కార్పొరేట్ రీసోర్సెస్ ప్రైవేటు లిమిటెడ్‌గా వ్యవహరిస్తోంది. ఈ సంస్థ కిందనే బిగ్ బజార్ చైన్ గ్రూపు నడుస్తోంది. ఇవన్నీ ఇటీవల ఒక్కొక్కటిగా మూతపడిన సంగతి తెలిసిందే. లీజుకు తీసుకున్న భూమిలో భారీ షాపింగ్‌మాల్ (వైజాగ్ సెంట్రల్) నిర్మాణం కోసం సుహానీ గ్రూపు ముంబైలోని ఆర్‌బీఎల్ బ్యాంకులో రుణానికి దరఖాస్తు చేసింది. తొలుత వర్కింగ్ కేపిటల్ కింద రూ.50 కోట్లు, ఆ తరువాత 2018 ఫిబ్రవరిలో రూ.200 కోట్లు తీసుకుంది. అక్కడి నుంచి అవసరమైనప్పుడల్లా రుణం తీసుకుంటూ 2019 మార్చి 27 నాటికి ఆ రుణాన్ని రూ.350 కోట్లకు చేర్చింది. దఫదఫాలుగా రుణం తీరుస్తూ వచ్చింది. కొంత ... మిగతా 6వ పేజీలో

ఆర్టీసీకి పండుగ

సంక్రాంతి స్పెషల్స్ ఆదాయం రూ.1.8 కోట్లు

- గత ఏడాది కంటే 50 శాతం అధికం
- 1121 ప్రత్యేక సర్వీసులు నడిపిన విశాఖ రీజియన్
- సగటు ఆక్యుపెన్సీ రేషియో 62 శాతం



ఆర్టీసీకి పండుగ తాకిడి (ఫైల్ ఫొటో)

ద్వారకా బస్‌స్టేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు సర్వీస్‌లు నడిపిన ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు...అందుకు తగ్గట్టుగానే ఆదాయం రావడంతో సంతోషంగా ఉన్నారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ, తిరిగి 16 నుంచి 21వ తేదీ వరకూ 1,121 (దూర ప్రాంతాలకు 584, జోన్ పరిధిలోని ప్రాంతాలకు 537) ప్రత్యేక బస్సులు నడిపారు. రెగ్యులర్ సర్వీస్‌లకు అదనంగా హైదరాబాద్ 120, విజయవాడ 280, భీమవరం 12, కాకినాడ 75, రాజమండ్రి 95, తిరుపతి 2, జోన్ పరిధిలోని శ్రీకాకుళం 254, ఇచ్ఛాపురం 50, టెక్కలి 17, పలాస 18, సోంపేట 10, మందస 7, పర్లాకిమిడి 4, విజయనగరం 110, సాలూరు 20, పార్వతీపురం 32, రాజాం 15 సర్వీస్‌లు ఆపరేట్ చేశారు.

ఆదాయం రూ.1.8 కోట్లు

ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు సంక్రాంతి స్పెషల్స్ ద్వారా రూ.1.8 కోట్లు ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. ప్రయాణికుల నుంచి సాధారణ చార్జీలు మాత్రమే వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో ప్రత్యేక సర్వీసులు నడిపినప్పటికీ ... మిగతా 6వ పేజీలో

సమర్ధంగా పనిచేశాననే సంతృప్తితో వెళుతున్నా



- జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్
- ఈ ఆరు నెలల్లోనే నగర పాలక సంస్థకు రూ.110 కోట్ల మేర ఆదాయం పెంపునకు కృషి
- ఓపెన్ స్పేస్‌ల పరిరక్షణకు చర్యలు
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా జీవీఎంసీని తీర్చిదిద్దేందుకు ప్రణాళిక
- స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో మంచి ర్యాంకు లభించేలా నగరాన్ని సిద్ధం చేశాం

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల కాలంలో జీవీఎంసీకి అదనంగా రూ.110 కోట్ల ఆదాయం పెరిగేలా కృషిచేశానని కమిషనర్‌గా పనిచేసి బదిలీపై వెళుతున్న పి.సంపత్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్‌గా తాను సమర్థంగా పనిచేశాననే సంతృప్తితో వెళుతున్నానన్నారు. నివాస కేటగిరీలో ఉంటూ వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వాటిని కమర్షియల్ అసెస్‌మెంట్‌గా మార్చి ఆ మేరకు పన్ను విధించడం, అదనపు అంతస్థులు నిర్మించిన వారికి పన్ను పెంపు ద్వారా జీవీఎంసీకి ఆస్తి పన్ను డిమాండ్‌ను రూ.30 కోట్లు పెంచామన్నారు. అలాగే పరిశ్రమలకు నీటి చార్జీలను పెంచడం ద్వారా రూ.80 కోట్లు అదనపు ఆదాయం వచ్చేలా చేశానన్నారు. దీనివల్ల జీవీఎంసీకి ఏటా రూ.110 కోట్ల వరకు ఆదాయం పెరుగుతుందన్నారు.

నగర పరిధిలోని గెడ్డల్లో చెత్త పడేస్తుండడం వల్ల ఎప్పటికప్పుడు పూడికతీయాల్సి వస్తున్నదని, ఈ నేపథ్యంలో 300 కిలోమీటర్ల పొడవున గెడ్డలకు ఇరువైపులా మూడు మీటర్ల ఎత్తున ఇనుప మెష్‌లు ఏర్పాటుచేసేందుకు ప్రణాళికలు రూపొందించానన్నారు. దీనికి సంబంధించిన అంచనాల తయారీ ... మిగతా 6వ పేజీలో

చోరీల నియంత్రణకు డ్రోన్‌లతో గస్తీ



- మార్చి నాటికి అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు
- సీపీ శంఖబ్రతబాగ్చి

- 8వ పేజీలో

మెట్రోకెమ్ ఫార్మాలో అగ్ని ప్రమాదం



- ఈటీపీ భవనం మూడో అంతస్థులో వేస్ట్ నుంచి రాజుకున్న మంటలు
- దెబ్బతిన్న భవనం, రూ.లక్షల్లో ఆస్తి నష్టం

... మెయిన్‌లో

విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవస్థలు

భీమునిపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 3,4 వార్డుల్లోని విద్యుత్ వినియోగదారులు బిల్లుల చెల్లింపునకు అవస్థలు పడుతున్నారు. ఆయా వార్డుల్లో మీసేవా కేంద్రాలు లేకపోవడం, చాలామందికి స్మార్ట్ ఫోన్ల వినియోగం తెలియకపోవడంతో సమస్య ఎదుర్కొంటున్నారు. గతంలో పాతబస్టాండ్ దగ్గర మీసేవా కేంద్రం ఉండేది. చాలా మంది అక్కడ బిల్లులు చెల్లించేవారు. అంతకముందు గంటస్తంభం వద్ద కరెంటు ఫ్యూజు కాల్ ఆఫీసులో ఆఫ్‌లైన్‌లో బిల్లులు చెల్లించేవారు. ఈ కేంద్రం వినియోగదారులకు ఎంతో సౌలభ్యంగా ఉండేది. కాలక్రమంలో ఆ సంస్థ అధికారులు ఈ కార్యాలయాన్ని ఎత్తివేశారు. కొందరు మధురవాడ ఏపీఈపీడీసీఎల్ కేంద్రానికి వెళ్లి బిల్లులు చెల్లిస్తున్నారు. కొన్నిచోట్ల ప్రైవేటు కేంద్రాలు ఉన్నా.. వారు బిల్లుపై అదనంగా రూ. 5 వసూలు చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్‌లో ఆన్‌లైన్ పేమెంట్ చేసుకోవాలని అధికారులు సలహా ఇచ్చి వదిలేస్తున్నారు. ఇది అందరికీ సాధ్యం కావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి బిల్లుల చెల్లింపునకు కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

తుప్పు పడుతున్న వాహనాలు



గ్యారేజీలో ఉన్న పాడైన వాహనాలు

సింహాచలం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి ట్రాన్స్‌పోర్టు విభాగం అధికారుల నిర్లక్ష్యం వల్ల లక్షలాది రూపాయలు విలువ చేసే కొన్ని వాహనాలు తుప్పు పట్టి పాడవుతున్నాయి. దీంతో స్వామివారి ఖజానాకు నష్టం వాటిల్లుతోంది. అప్పన్న భక్తుల రాకపోకలకు వినియోగించిన మినీబస్సు, రెండు సాధారణ బస్సులు, జీపు కాలం చెల్లడంతో వాటిని గ్యారేజీలో నిరుపయోగంగా ఉంచారు. నిబంధనల మేరకు ఆయా వాహనాలను బహిరంగ వేలం లేదా టెండర్ విధానంలో విక్రయించాల్సి ఉంది. కానీ అధికారులు వేలం వేయకుండా ఎండ, వానలో వదిలేయడంతో తుప్పుపట్టి పాడవుతున్నాయి. అధికారుల తీరుపై భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డుపైనే పార్కింగ్



మిథిలాపురి వుడా కాలనీలో రోడ్డుపై ఉన్న వాహనాలు

మధురవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మధురవాడలోని పలు ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌కు స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా నగరంపాలెం రోడ్డు, మధురవాడ డైలీ మార్కెట్, మిథిలాపురి వుడాకాలనీ, రేవళ్లపాలెం రహదారి, పోతినమల్లయ్యపాలెం, హెచ్‌బీ కాలనీ ప్రధాన రహదారి, కారుషెడ్ ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనదారులు రోడ్డు పక్కన నిలిపివేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో పాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు, జోన్-2 జీవీఎంసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి, ముఖ్యమైన ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పెంట గ్రామంలో 'పొలం పిలుస్తోంది'



మాట్లాడుతున్న ఏడీ విజయ్ ప్రసాద్

పద్మనాభం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రబీలో సాగు చేస్తున్న నువ్వులు, రాగులు, వేరుశెనగ, మినప పంటలకు సంబంధించి రైతులు అధికారుల సూచనలు. సలహాలు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చునని భీమిలి వ్యవసాయ శాఖ ఏడీ బి.విజయ్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన పెంట గ్రామంలో సర్పంచ్ బోదల పావని ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అలాగే విధిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ చలం, ఉప సర్పంచ్ తాతాజీ, పశు వైద్యులు జి. శ్రీనివాస్, పాల్గొన్నారు.

వచ్చే నెలలో హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలు

- అందరి సహకారంతో విజయవంతానికి కృషి
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- కలెక్టర్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలన



ఉత్సవ్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

భీమునిపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేద్దామని హైస్కూల్ శతాబ్ది ఉత్సవ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం పాఠశాలలో జరిగిన ఉత్సవ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా వందేళ్లు పూర్తి చేసుకున్న హైస్కూళ్లు చాలా అరుదుగా ఉన్నాయని, వాటి సరసన భీమిలి ఉన్నత పాఠశాల చేరడం మనకు గర్వకారణమన్నారు. ఉత్సవాలను ఆశీర్వదిస్తూ సావనీర్‌కు ప్రధాని మోదీ ప్రత్యేక సందేశం పంపారని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖా మంత్రి, తదితరుల నుంచి కూడా సందేశాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు.వచ్చే నెల 1, 2 తేదీల్లో జరిగే ఈ ఉత్సవాలకు మంత్రి లోకేశ్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈమేరకు పాఠశాల సుందరీకరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే పైలాన్ నిర్మాణం కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉత్సవాలకు వచ్చేవారికి వసతి, రవాణా సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు.కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా సంపూర్ణ సహకారం అందించి, ఉత్సవాలను విజయవంతం చేస్తామని తెలిపారు. పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలు, ప్రస్తుత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్కూల్ కమిటీ అందరినీ భాగస్వాములను చేసి ఉత్సవాలను ఘనంగా జరుపుకొందామన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే గంటా చాలాసార్లు తనతో చర్చిస్తున్నారని, వారి చొరవతో ఉత్సవాల గురించి రాష్ట్ర ఎస్ఎస్ఏ ప్రాజెక్టు డైరెక్టర్‌తో పాటు సీఎస్‌కు తెలియజేశామన్నారు. ఇప్పటికే డీఈఓ నోడల్ అధికారిగా పలు కమిటీలను ఏర్పాటు చేశామని, ఆయా కమిటీలు పూర్వ విద్యార్థులతో ఏర్పడిన కమిటీలతో చర్చించుకుని ప్లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేయాలన్నారు. రెండు రోజుల్లో తాను కలెక్టరేట్‌లో అధికారులు,ఉత్సవ్ కమిటీ ముఖ్యులతో సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. రేపటి నుంచి పెయింటింగ్, పాఠశాల ఆవరణ పరిశుభ్రతా పనులు ప్రారంభమవుతాయన్నారు.అనంతరం ఉత్సవ్ లోగోను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ ఆవిష్కరించారు. పాఠశాల హెచ్ఎం పొన్నగంటి రమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉత్సవ్ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి పూసర్ల శ్రీనివాసరావు, కమిటీ ముఖ్య ప్రతినిధులు మైలపల్లి షణ్ముఖరావు, ఎంవీ పార్వతీశం, రాజేటి బసవ కృష్ణమూర్తి, కాళ్ల సన్నీ, విద్యా కమిటీ ఛైర్మన్ ఇ. శారద, 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, డీఈవో ప్రేమ్‌కుమార్, ఏసీపీ చంద్రశేఖర్, డీవైఈవో సోమేశ్వరరావు, జోనల్ కమిషనరు పి. ప్రేమ ప్రసన్న వాణి, తహసీల్దార్ పైలా రామారావు, ఎంపీడీవో హనుమంతరావు, ఎంఈవోలు మానేపల్లి శివరాణి, అట్టాడ జయప్రద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, డివీస్ సీఎస్ఆర్ మేనేజర్ సురేశ్ కుమార్, పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకు వద్ద పేరుకుపోయిన చెత్త

కురపల్లిలో పారిశుధ్య లోపం

పద్మనాభం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పాండ్రంగి పంచాయతీ శివారు గ్రామం కురపల్లిలో పారిశుధ్యం లోపించింది. గ్రామంలో ఎక్కడ చూసినా.. చెత్తాచెదారమే కనిపిస్తోంది. కాలువలు పూడికలతో నిండిపోయాయి. ముఖ్యంగా రక్షిత మంచినీటి పథకం వద్ద చెత్త పేరుకుపోవడంతో పాటు మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. తాగునీరు కలుషితమైన రోగాలు ప్రబలుతున్నాయి.ఈ సమస్య ఎప్పటి నుంచో ఉన్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

కిశోర బాలల వికాసంపై శిక్షణ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ శ్రీదేవి

పద్మనాభం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కౌమార దశలో ఉన్న బాలబాలికల వికాసానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించిందని ఎంపీడీఓ విజయకుమార్ చెప్పారు. పద్మనాభంలోని వెలుగు కార్యాలయంలో కిశోరీ వికాసం కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏళ్ల నుంచి 19 ఏళ్ల మధ్య ఉన్న వారికి మానసిక, శారీరక వికాసాలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలన్నారు.జీవితంలో కీలకమైన ఈ దశలో వారికి సఖి కేంద్రాల ద్వారా ప్రభుత్వం అనేక విద్యా వికాస, ఉపాధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తోందన్నారు. ముఖ్యంగా వారికి సామాజిక పరిస్థితులు, బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించాలన్నారు. ఐసీడీఎస్ పీఓ శ్రీదేవి మాట్లాడుతూ శిక్షణ పూర్తయిన తరువాత ప్రతి సచివాలయ పరిధిలో కిశోర బాల, బాలికలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. 15 మంది సభ్యులకు సఖి కమిటీ ఏర్పాటు చేసి పలు అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్వప్న, జెడ్పీ పాఠశాల హెచ్ఎం సన్యాసిరావు, ఏఓ జయ ఉమ, ఏఎస్ఐ శ్రీనివాసరావు,ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, జానకి, సీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డేవిడ్‌రాజు, వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి శరణ్య, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీపురం పాఠశాలలో మట్టిని పరీక్షిస్తున్న విద్యార్థులు, వ్యవసాయాధికారులు

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

భీమునిపట్నం (రూరల్), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అధికారులు స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్‌కు ఎంపిక చేశారు. ఇటీవల ఈ పాఠశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాధికారులు సందర్శించారు. పాఠశాలలో భూసార పరీక్షలకు తగినంత స్థలం ఉండడంతో ఎంపిక చేశారు. ఈమేరకు మంగళవారం భూసార పరీక్షా విభాగం సంచాలకుడు టి. దాసు, రైతు శిక్షణా కేంద్రం సహాయ సంచాలకుడు హరికృష్ణ, వ్యవసాయాధికారి సురేశ్, భీమిలి ఏఓ కోమలి పాఠశాలను సందర్శించి, భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మట్టి నమూనా సేకరించే విధానం,వాటిని పరీక్షించే పద్ధతులను ప్రత్యక్షంగా చేసి, చూపించారు. ఈ సందర్భంగా ఏఓ కోమలి మాట్లాడుతూ ఇకపై మండలంలో జరిగే పొలం పిలుస్తోంది కార్యక్రమం లో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములు చేస్తామన్నారు.

అప్పన్న ఆలయంలో అంతర్గత బదిలీలు కొందరికేనా?

సింహాచలం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పరిపాలనా సౌలభ్యానికి, పారదర్శకమైన పాలన అందించేందుకు దేవాలయాల్లో కనీసం మూడు నెలలకు ఒకసారైనా అంతర్గత బదిలీలను ఆయా దేవస్థానాల ఈఓలు చేయాలన్న నిబంధన ఉంది. ఈమేరకు సింహాచలం పరిధిలో కూడా తరచూ అంతర్గత బదిలీలు చేపడుతున్నారు. అయితే బదిలీలు చేస్తున్న తీరు పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా దేవస్థానంలో పనిచేస్తున్న పర్యవేక్షణాధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లతో పాటు నాల్గవ తరగతి ఉద్యోగులను కూడా బదిలీ చేస్తున్నారు. ఆలయంలో రెగ్యులర్ ఉద్యోగుల కంటే ఎక్కువ మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే ఉన్నారు. ప్రధానాలయం, అన్నప్రసాద విభాగం మరికొన్ని విభాగాల్లో కొన్నేళ్లుగా వారు పాతుకుపోయారన్న విమర్శలు ఉన్నాయి. ఆలయంలో అంతా తానే అన్నట్టు పనిచేసే మరో కాంట్రాక్టు ఉద్యోగి కూడా పదేళ్లుగా విధులు నిర్వహిస్తూ అధికారుల కనుసన్నల్లో మెలుగుతుండడం గమనార్హం. ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారి వల్ల స్వామివారి ఆదాయానికి గండి పడుతోందన్న వాదనలు ఉన్నాయి. ఈఓ వారిపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడికి అభినందనలు

పద్మనాభం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.ఎం.ఎస్ పరశురామరాజును ఆ పార్టీ మండల నాయకులు మంగళవారం నగరంలో కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు హంస మహేశ్, నాయకులు సారిక ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

'జీవీఎంసీ కమిషనర్ బదిలీపై పునరాలోచించాలి'

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ బదిలీపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్‌యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు కోరారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి ఆరునెలలు గడవకముందే బదిలీ చేయడం దారుణమన్నారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించారని, మరికొన్ని పరిష్కార దశలో ఉన్నాయని చెప్పారు.

29 నుంచి 'ఎక్సలెన్స్ మీట్'

సాగర్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికి తీయడానికి గీతం వర్సిటీ బిజినెస్ స్కూల్ మూడు రోజుల పాటు నిర్వహించే గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్) 2025ను ఈనెల 29,30,31 తేదీల్లో నిర్వహించనున్నట్టు బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా పణిపప్పు తెలిపారు. మంగళవారం ఆయన ఆహ్వాన కమిటీతో కలిసి విలేకరుల సమావేశంలో జెమ్ వివరాలు వెల్లడించారు. 30 ఏళ్లుగా జెమ్‌ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నామని, ఎందరో విద్యార్థుల ప్రతిభకు ఇది వేదికగా నిలిచిందని చెప్పారు. ఈఏడాది నిర్వహిస్తున్న వేడుకల ముఖ్య ఉద్దేశం యువతలో నాయకత్వ లక్షణాలను బలోపేతం చేయడమని తెలిపారు. 29న చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్స్ సమ్మేళనం, 30, 31వ తేదీల్లో విద్యార్థులకు వాణిజ్య అంశాలపై వర్క్‌షాప్, కార్పొరేట్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చ నిర్వహిస్తామని చెప్పారు.

ఘనంగా కైలాసనాథుని ఆలయ వార్షికోత్సవం

విశాలాక్షినగర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : కైలాసగిరిపై ఉన్న కైలాసనాథుని ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అర్చకుడు కాశీబాబు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో సుమారు వెయ్యి మందికి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేజెళ్ల సుబ్బరాజు, అక్కరబోయిన రాంబాబు, వెలగపూడి శ్యామలరావు, సాంబశివారావు పాల్గొన్నారు.

సజావుగా దేహదారుఢ్య పరీక్షలు

విశాలాక్షినగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో పురుష అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పరీక్షలకు 600 మంది అభ్యర్థులకు 485 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్. మోహనరావు, పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు టి. లక్ష్మీ, ఎల్. మన్మథరావు, బి. రామకృష్ణారావు పాల్గొన్నారు.

పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

డాబాగార్డెన్స్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఈ విద్యా సంవత్సరం 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆకాంక్షించారు. జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం ఏఎస్సీఈఆర్టీ సహకారంతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఉపాధ్యాయులంతా విద్యార్థులతో వీటిని ఎక్కువ తర్ఫీదు చేయించి మన జిల్లాను మంచి స్థానంలో నిలపాలన్నారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని కచ్చితంగా ఆ విద్యార్థి ఉత్తీర్ణుడయ్యే బాధ్యత చేపట్టాలన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలపై సమాజానికి నమ్మకం కలుగుతుందన్నారు. డీఈఓ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ పదో తరగతిలో ఉన్నతంగా లక్ష్యాలు చేరుకునేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ జె.చంద్రశేఖర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదుల భవనం

అసంపూర్తిగా పాఠశాల భవన నిర్మాణం

- గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్ల విద్యార్థులకు వసతి కరువు
- నిధుల మంజూరుపై అధికారుల్లో కానరాని స్పష్టత

భీమునిపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. గత వైసీపీ ప్రభుత్వం అరకొరగా నిధులు మంజూరు చేయడంతో పనులు పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు వసతి లేమితో ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో భవన నిర్మాణం పూర్తవుతుందని పలువురు భావిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలకు రెండు తరగతి గదులతో అదనపు భవనం మంజూరు చేసింది. భవనంతో పాటు పాఠశాలలో మరుగుదొడ్లు, ఇతర పది పనులకు మొత్తం రూ. 99,43,944 లక్షలతో అంచనాలు రూపొందించారు. వీటిలో రెండు తరగతి గదుల నిర్మాణానికి రూ. 25,99,945 లక్షలతో అంచనా వేశారు. తొలుత సాంఘిక సంక్షేమ శాఖ ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్పొరేషన్ అధికారులు ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. బీమ్ వరకూ పనులు చేసినా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారని తెలిసింది. తర్వాత రూ. 16,46,056 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని జీవీఎంసీ ఆధ్వర్యంలో శ్లాబ్ వరకూ నిర్మాణం చేసిన తర్వాత ప్రభుత్వం ఆ నిర్మాణాన్ని నిలిపివేసి, తొలుత మరుగుదొడ్లు, తదితర పది అంశాలతో కూడిన పనులను చేయాలని ఆదేశించింది. దీంతో పనుల్లో మిగిలిన సిమెంట్‌ను పాఠశాల ఆవరణలో ఖాళీ స్థలాన్ని చదును చేయడానికి, మరుగుదొడ్ల మరమ్మతుకు వినియోగించారు. తర్వాత అవే పనులకు నాడు-నేడు పథకం కింద రూ. 73,43,999 అంచనా వేసి, రివాల్వింగ్ ఫండ్‌గా రూ. 25,99,945 విడుదల చేశారు. ఈ పనులు జరపడానికి అప్పటి ప్రభుత్వం సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ మెటీరియల్ సిస్టమ్‌లో ప్రతిపాదనలు పంపిస్తే ప్రభుత్వమే ఆయా మెటీరియల్‌ను పంపించి తగిన నిధులు ప్రభుత్వమే ఆయా మెటీరియల్‌కు కట్ చేస్తుంది. దీంతో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు పర్యవేక్షణ తప్ప మరే విషయాలు తెలియవని చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజా ధనం వ్యయానికి జవాబుదారీ తనం లేదనడానికి మచ్చుతునకగా ఈ భవనం నిలుస్తోంది. భవనం విషయమై, పాఠశాల హెచ్ఎంను అడిగితే తనకు తెలియదని, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను అడిగితే సాంఘిక సంక్షేమ అధికారులకు తెలుస్తుందంటారు. వారిని అడిగితే జీవీఎంసీ పేరు చెబుతారు. ఈవిధంగా ఎవరిని అడిగినా మరొకరిపై నెట్టివేస్తూ తప్పుకుంటున్నారు. వాస్తవానికి ఈ పనుల చెక్ పవర్‌లో హెచ్ఎం, ఎస్ఎంసీ కమిటీ, సీఆర్‌పీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉంటారు. కానీ ఎవరికీ తెలియదని చెబుతున్నారు. ప్రస్తుతం శతాబ్ది ఉత్సవాలు జరుపుకొంటున్న పాఠశాలలో ఈ అసంపూర్తి భవనం ప్రారంభంలో వెక్కిరిస్తూ కనిపిస్తోంది.

శతాబ్ది ఉత్సవాలకు 11 కమిటీల నియామకం

భీమునిపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం 11 కమిటీలను నియమించింది. ఈమేరకు డీఈఓ ఎన్. ప్రేమ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవాలకు ఓవరాల్ ఇన్‌ఛార్జిగా డెప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి ఎ. సోమేశ్వరరావును నియమించారు. ఇన్విటేషన్ కమిటీ కన్వీనర్‌గా ఆ పాఠశాల హెచ్ఎం పి. రమణ, కల్చరల్ కమిటీ, స్టేజ్ డెకరేషన్ కమిటీల కన్వీనరుగా భీమిలి ఎంఈవో-2 ఎ. జయప్రద, లాజిస్టిక్ కమిటీ, ప్రెస్ అండ్ పబ్లిసిటీ కన్వీనరుగా భీమిలి ఎంఈవో-1 ఎం. శివరాణి, రిఫ్రెష్‌మెంట్ కమిటీ కన్వీనరుగా లక్ష్మీపురం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పద్మజ, డిసిప్లైన్ కమిటీ కన్వీనరుగా తాళ్లవలస జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం జె. ప్రభాకర్, డ్రింకింగ్ వాటర్ కమిటీ కన్వీనరుగా భీమిలి ఎంపీహెచ్ఎస్ హెచ్ఎం ఐ. వెంకటరావు, శానిటేషన్ కమిటీ కన్వీనరుగా చిట్టివలస అంబేడ్కర్ ఎంపీహెచ్ స్కూల్ హెచ్ఎం స్వామి, పార్కింగ్ కమిటీ కన్వీనరుగా భీమిలి జీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ కె. సతీశ్‌ను నియమించారు. ప్రతి కమిటీలోనూ సభ్యులు కూడా ఉన్నారు.

సహకారం... ఇరకాటం

... 5వ పేజీ తరువాయి

సమయం తరువాత వాయిదాలు కట్టడం ఆపేసింది. సంస్థ పనితీరు గమనించిన బ్యాంకు 2022 ఆగస్టు నాటికి వడ్డీతో కలిపి ఇంకా రూ.129.62 కోట్లు బకాయి రావలసి ఉందని లెక్కలు తేల్చింది. సంస్థ ఆర్థిక స్థితిని అంచనా వేసి రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం ఆ బకాయిలు ఇక రావని, నిరర్థక ఆస్తి (నాన్ పెర్ఫార్మ్‌డ్ అసెట్-ఎన్‌పీఏ)గా నిర్ధారించింది. రుణం తీసుకున్న సంస్థకు, వారికి హామీదారుగా ఉన్న సూపర్‌బజార్ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చింది. తక్షణమే బకాయి కట్టకుంటే ఆస్తిని స్వాధీనం చేసుకుంటామని నోటీసులు ఇచ్చింది.

లీజు పత్రాల తనఖా...

హామీదారుగా సూపర్‌బజారు

లీజు వ్యవహారంలో ముంబై సంస్థ సుహానీ యాజమాన్యంతో అప్పటి కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ అధికారులు కుమ్మక్కయ్యారు. రుణం ఇవ్వాలంటే...లీజుకు ఇచ్చిన సంస్థ కూడా సంతకాలు చేయాలని ఆర్‌బీఎల్ బ్యాంకు డిమాండ్ చేయడంతో అధికారులు సంతకం చేశారు. దాంతో భూమిని బ్యాంకుకు హామీగా చూపించినట్టయింది.

రుణం తీసుకున్న గ్రూపు దివాళా తీయడంతో అప్పు తీర్చాల్సిన బాధ్యత కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్‌పై పడింది. రూ.129.62 కోట్లకు నోటీసులు రావడంతో విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దాంతో విచారణకు ఆదేశించింది. సహకార శాఖకు చెందిన డీసీఏఓ శ్యామలను విచారణాధికారిగా నియమించారు. జిల్లాలో సహకార శాఖ జాయింట్ కలెక్టర్ పరిధిలోకి వస్తుంది. దీనిపై విచారణ జరుగుతోందని, మూడు వారాల తరువాత గానీ ఏ విషయం చెప్పలేమని అంటున్నారు.

ఆర్టీసీకి పండుగ

... 5వ పేజీ తరువాయి

ఎటువంటి అదనపు చార్జీలు తీసుకోలేదని వెల్లడించారు.

సగటు ఆక్యుపెన్సీ రేషియో 62 శాతం

ప్రత్యేక సర్వీసుల సగటు ఆక్యుపెన్సీ రేషియో 62 శాతంగా ఉంది. ప్రత్యేక సర్వీస్‌లలో ఒక వైపు ప్రయాణంలో 95 శాతం ఓఆర్ ఉంటే, తిరుగు ప్రయాణంలో 35 నుంచి 45 శాతం మాత్రమే ఉండేది. ఈ విధంగా సగటు ఆక్యుపెన్సీ రేషియో 62 శాతంగా నమోదైంది. కాగా, ప్రత్యేక సర్వీసులు ఈపీకే (కిలోమీటరుకు ఆదాయం) రూ.42 సాధించినట్టు అధికారులు లెక్కలు కట్టారు.

గత ఏడాది కంటే 50 శాతం ఎక్కువ

గత ఏడాది కంటే ఈసారి సుమారు 50 శాతం సర్వీస్‌లు ఎక్కువగా నడిపినట్టు అధికారులు తెలిపారు. గత ఏడాది సుమారు 750 ప్రత్యేక సర్వీసులను ఆపరేట్ చేయగా, ఈ ఏడాది 1,121 సర్వీసులు నడిపారు. ఆదాయం కూడా అదే నిష్పత్తిలో గత ఏడాది కంటే 50 శాతం ఎక్కువగా వచ్చినట్టు అధికారులు వెల్లడించారు. గత ఏడాది సంక్రాంతి స్పెషల్స్ ఆదాయం రూ.1.2 కోట్లు రాగా, ఈ ఏడాది రూ.1.8 కోట్లు వచ్చినట్టు రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు వెల్లడించారు.

సమర్థంగా పనిచేశాననే... సంతృప్తితో వెళుతున్నా

... 5వ పేజీ తరువాయి

పూర్తయిందన్నారు. అలాగే జీవీఎంసీ పరిధిలో ఉన్న 1200 ఓపెన్ స్పేస్‌ల పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులను తీసుకువచ్చి పచ్చదనం పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో కబ్జాలకు గురికాకుండా ఓపెన్ స్పేస్‌ల వద్ద బోర్డులు ఏర్పాటుచేయబోతున్నామన్నారు. అదేవిధంగా రెండేళ్లలో జీవీఎంసీ పరిధిలో శత శాతం తారురోడ్లు ఉండేలా ప్రణాళికలు తయారుచేశామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా జీవీఎంసీని మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. ప్రతి జోన్‌లో టౌన్ లెవల్ ఫెడరేషన్స్ (టీఎల్ఎఫ్) ద్వారా ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులు విక్రయించేలా దుకాణాలు కేటాయించి వారికి రుణ సదుపాయం కల్పించడంతోపాటు వ్యాపారులకు వస్తువులు సరఫరా చేసేందుకు వీలుగా రవాణా సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్-2025లో దేశంలోనే ఒకటి, రెండు ర్యాంకులను సాధించేందుకు వీలుగా నగరాన్ని అన్ని రంగాల్లోనూ సన్నద్ధం చేశామన్నారు. దేశంలోనే ఉత్తమ నగరంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన అర్హత విశాఖకు ఉందని సంపత్‌కుమార్ అభిప్రాయపడ్డారు.

25 నుంచి పంచాయతన యాగ మహోత్సవం

ఎం.వి.పి.కాలనీ,జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25, 26 తేదీల్లో ఎంవీపీ కాలనీలోని టీటీడి కల్యాణ మండపంలోసరస్వతీ సహిత పంచాయతన యాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు శారదాంబ విద్యానికేతన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఒక ప్రకటనలో తెలిపింది. 25న ఉదయం 8 గంటల నుంచి విష్వక్సేన ఆరాధన, హయగ్రీవ మాలామంత్ర హవనం, మధ్యాహ్నం 3 గంటలకు వేంకటేశ్వరస్వామి కల్యాణం, ఊంజల్ సేవ, సాయంత్రం ఆరు నుంచి సప్తవాద్య తరంగిణి, స్వరార్చన, భగవన్నామ సంకీర్తన, 26న ఉదయం విద్యార్థుల సామూహిక సరస్వతీ, మేధా దక్షిణామూర్తి కుంకుమార్చన, పంచాయతన హోమాలు, అన్న సమారాధన, సాయంత్రం నుంచి వీణానాదం,సంకీర్తనార్చన, కూచిపూడి నాట్య ప్రదర్శన ఉంటాయని సంస్థ అధ్యాపక బృందం తెలిపింది.

సుకన్య సమృద్ధి పథకంతో బాలికలకు మేలు

ఎంవీపీ కాలనీ,జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఈ నెల 24న నగరంలోని పోస్టాఫీసుల్లో సుకన్య సమృద్ధి పథకం ఖాతాలు తెరవాలని తపాలా శాఖ విశాఖపట్నం డివిజన్ సీనియర్ పర్యవేక్షణాధికారి గజేంద్ర కుమార్ మీనా ఒక ప్రకటనలో కోరారు. పదేళ్ల లోపు వయసు గల బాలికల పేరిట ఖాతా తెరవచ్చని, ఇందులో ఏడాదికి రూ.250 నుంచి రూ. 1.5 లక్షల వరకూ జమ చేసుకోవచ్చని తెలిపారు. బాలికలకు ప్రత్యేకమైన ఈ పథకంలో ఎక్కువ వడ్డీ పొందవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆడపిల్లల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు సర్వీస్ ప్రొవైడర్ల మేళా

ఆరిలోవ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : తోటగరవులో ఉన్న రాధాకృష్ణ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు సర్వీస్ ప్రొవైడర్ల మేళా నిర్వహించనున్నట్లు జీవీఎంసీ జోన్ టూ అధికారులు తెలిపారు. మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. మెప్మా, హోం ట్రయాంగిల్ సంస్థ సంయుక్తంగా ఈ మేళా నిర్వహిస్తున్నారన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ జట్టు మేనేజర్‌గా నారాయణరావు

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడల్లో పాల్గొంటున్న ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ జట్టుకు నగరానికి చెందిన ఎం.నారాయణరావు మేనేజర్‌గా నియమితులయ్యారు. ఫిబ్రవరి 8 నుంచి డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ క్రీడల్లో రాష్ట్ర అథ్లెటిక్స్ జట్టుకు మేనేజర్‌గా వ్యవహరిస్తారు. రాష్ట్ర అథ్లెటిక్స్ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్, విశాఖ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్న నారాయణరావుకు స్పోర్ట్సు మేనేజ్‌మెంట్‌లో విశేష అనుభవం ఉంది. గత జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ మహిళల అథ్లెటిక్స్ జట్టు ఓవరాల్ రన్నరప్ ట్రోఫీ సాధించడంలో కీలక పాత్ర వహించారు. ఏఎఫ్ఐ జాతీయ స్థాయి టెక్నికల్ అఫీషియల్‌గా అర్హత కలిగిన నారాయణరావు. ఏపీ అథ్లెటిక్స్ జట్టుకు మేనేజర్‌గా నియమితులు కావడంపై ఒలింపిక్, అథ్లెటిక్స్ సంఘాల ప్రతినిధులు హర్షం ప్రకటించారు.

సినిమా గైడ్

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీ నరసింహ-1 (104ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 15, వంకాయలు (తెలుపు) 36,వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 18, క్యారెట్ 38 దొండకాయలు 40, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 32, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 45, పొటల్స్ 80, కీర దోస 34,కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 40, కంద 56, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50,కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

సంక్షేమానికి సర్వే బాట

- అర్హుల లబ్ధికి సర్వేలు
- తూర్పులో 98 శాతం జియో ట్యాగింగ్
- జోరుగా హౌస్ మ్యాపింగ్, పీఏసీఎస్ సర్వేలు



సర్వేలపై అవగాహన కల్పిస్తున్న అధికారి

మద్దిలపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వం సర్వే బాట పట్టింది. సాంకేతిక పరిజ్ఞానంతో పలు రకాల సర్వేలకు నాంది పలికింది. దీని ద్వారా అనర్హులను ఏరేసి, అర్హులకు న్యాయం చేసేలా చర్యలు ప్రారంభించింది. సచివాలయ సిబ్బంది ద్వారా ప్రతీ ఇంటిని సర్వే చేసి అర్హులను గుర్తించే పనిలో పడింది. తూర్పు నియోజకవర్గంలో 74 సచివాలయాల సిబ్బంది ప్రజల నివాసాలకు వెళ్లి సర్వే చేస్తున్నారు. సిరిపురం, పాండురంగాపురం, కిర్లంపూడి లేఅవుట్, ఎంవీపీకాలనీ ప్రాంత నివాసులు సర్వేలకు ఆసక్తి చూపడం లేదు. అటువంటి వారి వద్దకు అధికారులు వెళ్లి దీని ప్రాముఖ్యతను వివరిస్తున్నారు.

98 శాతం జియో ట్యాగింగ్ పూర్తి..

సచివాలయాల పరిధిలోని ప్రతీ ఇంటికి జియో ట్యాగింగ్ సర్వే నిర్వహించారు. ఇప్పటికే నియోజకవర్గంలో 98శాతం మ్యాపింగ్ పూర్తి చేశారు. ఇళ్లు మారిన వారు, ఇతర కారణాలతో ఇళ్లల్లో లేనివారి గృహాల మ్యాపింగ్ మాత్రమే పెండింగ్‌లో ఉంది. సచివాలయ సిబ్బంది ఇళ్లను సందర్శించి ఈ సర్వే పూర్తి చేశారు. సచివాలయాల పరిధిలోని ఇళ్లకు కార్యదర్శులు వెళ్లి వారి వివరాలు సేకరించి మ్యాపింగ్ చేశారు. ఇంటి సభ్యుల నుంచి ఒకరి ఆధార్ కార్డ్ ద్వారా వేలిముద్రలతో బయోమెట్రిక్ తీసుకుని, ఫోటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. దీని ద్వారా ఎవరు ఎక్కడ నివాసముంటున్నారు? ఆ ఇంటి సభ్యులు ఏమి వృత్తి చేస్తున్నారు, వారు సంక్షేమ పథకాలకు అర్హులా? కాదా? అనే విషయం ప్రభుత్వం తెలుసుకుంటోంది. అలాగే అదృశ్యమవుతున్న పౌరుల వివరాలు కూడా తెలుసుకుంటున్నారు. సంక్షేమ పథకాలు అందుకున్న వారు సచివాలయ పరిధిలో ఉన్నారా? లేదా? ఈ సర్వేలో తెలుసుకుంటున్నారు.

సొసైటీ సభ్యుల సర్వే...

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో సభ్యులైన రైతుల ధ్రువీకరణకు పీఏసీఎస్‌లో సర్వే నిర్వహిస్తున్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన చాలామంది తూర్పు నియోజకవర్గంలో నివాసముంటున్నారు. చాలా మందికి సొంత గ్రామాల్లో వ్యవసాయ భూములున్నాయి. గ్రామాల్లో భూ యజమానులు అందుబాటులో లేకపోవడంతో వారి వివరాలను నియోజకవర్గంలో నివాసముంటున్న సచివాలయాలకు పంపిస్తున్నారు. దీంతో ఇక్కడ సచివాలయ కార్యదర్శులు రైతు ధ్రువీకరణ సర్వే నిర్వహిస్తున్నారు. అన్ని రకాల సర్వేలు ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

పనుల నాణ్యతలో రాజీ వద్దు

వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ స్పష్టీకరణ



కారు పార్కింగ్ పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పనుల నాణ్యత విషయంలో క్షేత్రస్థాయిలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. మంగళవారం వీఎంఆర్డీఏ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తేదారులు నిర్దిష్ట కాల పరిమితికి లోబడి పనులు పూర్తి చేసేలా కార్యనిర్వాహక ఇంజనీర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. నాణ్యతలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్వహణ పనుల్లోనూ ఆడిటింగ్ చేసిన తరువాత మాత్రమే బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. అనంతరం మల్టీలెవల్ కారు పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించి ఫిబ్రవరి మొదటి వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ప్రారంభింపజేయడానికి సిద్ధం చేయాలన్నారు. ఇంజనీర్లకు అంతస్తుల వారీగా బాధ్యతలను అప్పగించాలని చెప్పారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, బలరామరాజు, సహాయ ఇంజనీర్లు పాల్గొన్నారు.

కైలాసగిరిపై పర్యాటకులకు పెద్ద పీట

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని,కొత్త కొత్త ప్రాజెక్టులు వస్తాయని, దానికి చెడ్డపేరు తెస్తే ఎవరినీ ఉపేక్షించమని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ హెచ్చరించారు. కైలాసగిరిపై వ్యాపారాలు చేసేవారిని కార్యాలయానికి పిలిపించి, వీఎంఆర్‌డీఏ సెక్రటరీ మురళీకృష్ణతో కలిసి మంగళవారం వారితో మాట్లాడారు. కైలాసగిరికి వచ్చే పర్యాటకులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, నిర్దేశించిన రేట్లనే వసూలు చేయాలని, ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదని సూచించారు. నిర్దేశించిన స్థలంలోనే వ్యాపారం చేసుకోవాలని, అదనపు స్థలాలు ఆక్రమిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. వీఎంఆర్‌డీఏ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న ప్రణవ్ గోపాల్



మాట్లాడుతున్న వీసీ శశిభూషణరావు

తరగతుల నిర్వహణ పక్కాగా జరగాలి

- అధికారులకు వీసీ దిశా నిర్దేశం

వెంకోజీపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏయూలో పటిష్టంగా తరగతులు నిర్వహించే దిశగా ప్రధానాచార్యులు, విభాగాధిపతులు కృషి చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. మంగళవారం అకడమిక్ సెనేట్ మందిరంలో ప్రధానాచార్యులు, విభాగాధిపతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సెలవులు అనంతరం తరగతులు ప్రారంభమయ్యాయని, ప్రతి విభాగంలో పటిష్టంగా బోధన జరగాలని స్పష్టం చేశారు. ప్రధానాచార్యులు విభాగాలతో సమన్వయం చేస్తూ వీటిని పర్యవేక్షించాలని చెప్పారు. అకడమిక్ కార్యకలాపాలకు విభాగాల్లో అత్యంత ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. హాస్టళ్లను చీఫ్ వార్డెన్లు, సహాయక వార్డెన్లు నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. వీటి నిర్వహణపై తరచూ సమీక్షించాలని ప్రధానాచార్యులకు సూచించారు. విభాగాలు, హాస్టళ్లలో ఎలాంటి సదుపాయాలు అవసరమైనా వెంటనే ప్రతిపాదనలు తమకు పంపాలని వీసీ సూచించారు. విద్యార్థులకు అనుకూల పరిస్థితులు, సదుపాయాలను పూర్తిస్థాయిలో అందించడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

జపనీస్ భాషలో డిప్లొమా కోర్సు

వెంకోజీపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భాషా ఔత్సాహికులకు ఉత్తేజకరమైన పరిణామంలో, ఏయూ జపనీస్ భాషలో డిప్లొమా కోర్సు కోసం ప్రవేశాలు ప్రారంభించింది. విదేశీ భాషల విభాగాధిపతి, జపాన్ సమాచార, అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ నేతృత్వంలోని ఈ చొరవ నేటి ప్రపంచీకరణలో విదేశీ భాషా నైపుణ్యాలకు పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుంది.ఆసక్తిగల విద్యార్థులు, ఇతరులు ఏయూ అడ్మిషన్ల డైరెక్టర్ లేదా ఏయూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రెండో అంతస్తులోని విదేశీ భాషల విభాగాన్ని 90140 88901 నెంబరులో సంప్రదించాలని సూచించారు. మొత్తం 40 సీట్లతో ఆరు నెలల కోర్సు సాయంత్రం వేళల్లో తరగతులు నిర్వహిస్తారన్నారు. ఆర్థిక, విద్యా, సాంకేతిక పురోగతిని పెంపొందించడంలో ఇలాంటి భాగస్వామ్యాల అపారమైన సామర్థ్యాన్ని గుర్తించి,జపాన్‌తో విద్య, సాంస్కృతిక సహకారాన్ని పెంచడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ డిప్లొమా కోర్సు పరిచయం రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, సమాచార సాంకేతిక మంత్రి నారా లోకేశ్ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉందని రామకృష్ణ నొక్కి చెప్పారు. ఈ కోర్సు విద్యార్థులు, సాధారణ ప్రజలకు జపనీస్ భాషలో సమర్థంగా భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను అందించడానికి రూపొందించినట్లు చెప్పారు. తద్వారా అంతర్జాతీయ అవకాశాలకు తలుపులు తెరుస్తుందన్నారు. జపాన్ ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా, సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా ఉండటంతో, జపనీస్ మాట్లాడే సామర్థ్యం విలువైన ఆస్తిగా మారిందన్నారు. జపనీస్ సంబంధాలు ఉన్న కంపెనీలు, బహుళజాతి సంస్థలు, జపనీస్ మార్కెట్‌లోకి ప్రవేశించాలనుకునే సంస్థలు భాష, సంస్కృతిని నావిగేట్ చేయగల నిపుణులు అవసరమన్నారు. జపనీస్ మాట్లాడే నిపుణుల డిమాండ్ క్రమంగా పెరుగుతోందన్నారు. ఈ కోర్సు భాషపై పట్టు సాధించడానికి అధికారిక విద్యా మార్గాన్ని అందించడం ద్వారా ఈ అవసరాన్ని తీర్చడానికి ఉపకరిస్తుందన్నారు.

24న ఐటీఐలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గాజువాక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 24న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అమర్ రాజా గ్రూప్ వారు ఈ ఇంటర్వ్యూలను నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆ రోజు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9177338977 సెల్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

హైబ్రిడ్ సోలార్ డ్రైయర్

లడఖ్, కార్గిల్ రైతుల కోసం రూపొందించిన గీతం టెక్నాలజీ నిపుణులు

సాగర్‌నగర్ (విశాఖపట్నం), ఎండాడ 21 (ఆంధ్రజ్యోతి): ఏడాది పొడవునా అతి చల్లని వాతావరణం ఉండే లడఖ్, కార్గిల్ ప్రాంతాల్లో ఉద్యాన, వివిధ వ్యవసాయోత్పత్తులను మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా భద్రపరచడానికి వీలైన సాంకేతిక పరిజ్ఞానాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని గీతం టెక్నాలజీ ఎనేబిలింగ్ సెంటర్ (జి-టెక్) నిపుణులు అభివృద్ధి చేశారు. వీరు రూపొందించిన 'హైబ్రిడ్ సోలార్ డ్రైయర్‌'ను ఈనెల 19న లడఖ్‌లో జరిగిన కార్యక్రమంలో లడఖ్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్‌కే మెహతాకు అందజేశారు. జి-టెక్ నిపుణులు డాక్టర్ కేవీవీఎస్ఆర్ చంద్రమౌళి, గీతం విశిష్ట ప్రొఫెసర్ డాక్టర్ గురజాడ రవికుమార్, జి-టెక్ అధికారి సోంబట్‌శాస్త్రి సాంకేతిక పరిజ్ఞానంతో డ్రైయర్‌ను రూపొందించారు. ఇందులో తక్కువ వ్యయంతో ఉష్ణోగ్రతలను నియంత్రించే సెన్సార్‌లు ఉంటాయి. పగటిపూట గ్రహించిన సౌరశక్తిని నిల్వ చేసి రాత్రి సమయంలో తగు ఉష్ణోగ్రతల మధ్య పంటలను సంరక్షిస్తుంది. దీనివల్ల ఆహారోత్పత్తుల రంగు, రుచి వాసనలో మార్పులు ఉండవన్నారు. లడఖ్, కార్గిల్ ప్రాంతాలలో అధికంగా పండే ఆప్రికాట్, తదితర పండ్లను తేమ లేకుండా పొడి బారేలా చేయడం ద్వారా దీర్ఘకాలం నిల్వ చేసుకోవచ్చునని వెల్లడించారు. ఈ సందర్భంగా లడఖ్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఎస్.కె.మెహతా మాట్లాడుతూ సరైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేక తమ ప్రాంత రైతులు పంట దిగుబడిలో 60 శాతం వరకు కోల్పోతున్నారని, గీతం నిపుణులు రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం పంటలలో తేమ వల్ల జరిగే నష్టాలను నివారించి నాణ్యతతో కూడిన ఎగుమతులకు మార్గం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. విశ్వవిద్యాలయంలోని పరిశోధన ఫలితాలు క్షేత్రస్థాయిలో ఉపయోగపడడం అభినందనీయమన్నారు. జి-టెక్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడుతూ ఇటీవల మిజోరం రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ నిపుణులు అందజేశారన్నారు.ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం టీటీఐ డివిజన్ శాస్త్రవేత్త డాక్టర్ పి.కృష్ణకాంత్, అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చి శాస్త్రవేత్త డాక్టర్ సంజయ్‌కుమార్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం టెక్నాలజీ ఎనేబిలింగ్ సెంటర్ (హెచ్-టెక్) నిపుణులు డాక్టర్ జి.ఎస్.ప్రసాద్, ప్రొఫెసర్ ఎస్.రాజగోపాల్, డాక్టర్ బి.సునీల్, గీతం వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ అధిపతి వికాశ్‌కుమార్, శ్రీవాత్సవ, జి-టెక్ అసిస్టెంట్ మేనేజర్ అలేఖ్య మారం తదితరులు పాల్గొన్నారు.

నగర క్రీడా నిపుణుల ప్రతిభ

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 12 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక 38వ జాతీయ క్రీడలకు సాంకేతిక నిపుణులుగా నగరానికి చెందిన పలువురు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, బాక్సింగ్ సమాఖ్యల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీకి ఇంటర్నేషనల్ రిఫరీ కంచరాన సూర్యనారాయణ, స్విమ్మింగ్ పోటీలకు మోహన, వెంకటరామ్, బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీకి ద్రోణాచార్య అవార్డీ ఐ.వెంకటేశ్వరరావు, ఇండియన్ రైల్వే కోచ్ రెడ్డి శ్రీనివాసరావులు టెక్నికల్ అఫీషియల్స్‌గా వ్యవహరిస్తారు. వీరిని ఒలింపిక్ సంఘం విశాఖ ప్రతినిధులు అభినందించారు.

ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని జీఎంకు వినతి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జీఎం (స్టీల్ అండ్ మైన్స్) పీఎస్ రావును ఇంటక్ నాయకులు కోరారు. ప్లాంటులో మంగళవారం జీఎంతో ఇంటక్ నాయకులు సమావేశమై పలు అంశాలను వివరించారు. సకాలంలో జీతాలు అందరక ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు విభాగాల్లో సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణ ప్రకటనతో ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు తగిన సౌకర్యాలు కల్పించాలని వేడుకున్నారు.

రహదారి విస్తరణ వద్దని ఆందోళన



సచివాలయం వద్ద నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

పెందుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్ఆర్ పురంలో రహదారి విస్తరణ పనులు చేపడితే తాము ఆస్తులు కోల్పోయి తీవ్రంగా నష్టపోతామని, అందువల్ల పనులు నిలిపివేయాలంటూ మంగళవారం సర్పంచ్ దూది విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద ప్రజలు ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయకపోతే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. పేదల నివాసాలను తొలగించి అభివృద్ధి అంటారా అంటూ నిరసన వ్యక్తం చేశారు.



బాటిల్‌పై ఉన్న ఎమ్మార్పీ ధరను పరిశీలిస్తున్న కొల్లు రవీంద్ర

ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు

ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర

పెందుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఎమ్మార్పీ ధరలు ఉల్లంఘించే వారికి జరిమానాలు విధిస్తూ లైసెన్సులు రద్దు చేసేలా శాఖాపరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. మండలంలోని జెర్రిపోతులపాలెంలో గల ఏపీ ఐఎంఎఫ్ఎల్ మద్యం డిపోను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.డిపోలోని స్టాక్ రికార్డులను పరిశీలించారు. మద్యం కేసుల సరఫరాపై ఆరా తీశారు. బాటిళ్లపై ఉన్న లేబుళ్లను, ఎమ్మార్పీ ధరలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డిపోలోని కార్మికులతో మంత్రి కాసేపు ముచ్చటించారు. విశాఖ పరిధిలో మూడు మద్యం డిపోలు ఉన్నాయని జెర్రిపోతులపాలెం డిపోలో హమాలీల సంఖ్య ఎక్కువగా ఉన్నా, అందుకు తగ్గట్టు స్టాక్ సరఫరా లేదని పలువురు పేర్కొన్నారు. ఇక్కడి హమాలీలను మూడు డిపోల్లోకి సర్దుబాటు చేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు. అందుకు మంత్రి స్పందిస్తూ శాఖాపరంగా సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆ తర్వాత కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో బెల్ట్ షాపులు లేకుండా చేయడం, కల్తీ లేని మద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఉన్నారు.

పాతవెంకోజీపాలెంలో పరస రేపు

వెంకోజీపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాతవెంకోజీపాలెంలో సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో 23న పరస మహోత్సవం జరుగుతుందని సంఘం అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి పాత వెంకోజీపాలెం ప్రధాన రహదారిపై ఈ పరస మహోత్సవం జరుగుతుందన్నారు. ఆట వస్తువులు, గృహోపకరణాల విక్రయం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : సీఐ



ఎం.వి.పి.కాలనీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు ఇబ్బంది కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఎంవీపీ సీఐ జూరెడ్డి మురళి హెచ్చరించారు. గొడవల్లో తలదూర్చినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా రౌడీషీట్ తెరుస్తామని స్పష్టం చేశారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... కొన్ని కార్యక్రమాల్లో భారీగా సౌండ్ సిస్టమ్స్ వినియోగిస్తున్నారని, శబ్ద కాలుష్యం ఎక్కువగా ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. అదృశ్యం కేసుల్లో చురుగ్గా దర్యాప్తు చేసి, సంబంధిత వ్యక్తులను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నామని తెలిపారు. ఎంవీపీ కాలనీ స్టేషన్ పరిధిలో ఉన్న మురికివాడల నుంచి భార్యాభర్తల గొడవలు ఎక్కువగా వస్తున్నాయని, తరచూ కౌన్సెలింగ్ చేస్తున్నామని సీఐ తెలిపారు. న్యూసెన్స్, చీటింగ్ కేసులూ ఎక్కువగా ఉంటున్నాయన్నారు. తమ స్టేషన్ పరిధిలో ఉన్న 54 మంది రౌడీ షీటర్లపై నిఘా ఉంచామన్నారు. ఇటీవల పది మందిపై రౌడీ షీట్లు తెరిచినట్లు చెప్పారు. వీరి కదలికలపై ప్రతి కానిస్టేబుల్ ఓ కన్నేసి ఉంచేలా బాధ్యత అప్పగించామన్నారు. ప్రతి రౌడీషీటరు రోజూ తాము ఎక్కడున్నదీ లోకేషన్‌ను పంపించాల్సి ఉంటుందన్నారు. మహిళా కానిస్టేబుళ్ల కొరత కారణంగా ఎదురవుతున్న సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సీఐ తెలిపారు. పేకాట, బెట్టింగ్‌పై ప్రజలు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

దివ్యాంగ పింఛనర్లకు కంటి పరీక్షలు



పింఛన్‌దారుని కంటి పరీక్షలు పర్యవేక్షిస్తున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

మద్దిలపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కేటగిరిలో పింఛన్లు అందుకుంటున్న వారికి విశాఖ ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీపతి పర్యవేక్షణలో వైద్యులు పరీక్షలు చేపట్టారు. వందమంది అంధులకు తనిఖీలు నిర్వహించారు. వీరితో ఇద్దరు, ముగ్గురు సహాయకులు రావడంతో ఆసుపత్రి ఆవరణలో రద్దీ పెరిగింది. పరీక్షలు చేసుకుని ఇళ్లకు వేగంగా వెళ్లిపోవాలని పింఛన్‌దారులు హడావుడి చేయడంతో కాసేపు కంటి తనిఖీలు ఆపేశారు. ఒక్కొక్కరికి అయిదు నుంచి పది నిమిషాల సమయం పట్టడంతో పరీక్షలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఎవరు ఎప్పుడు తనిఖీకి రావాలన్నదీ సమాచారం ఇచ్చామని జోన్-3 ఏపీడీ రాము తెలిపారు.

అక్రమ బ్రిడ్జిపై ఇరుక్కుపోయిన లారీ

వెంకోజీపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మార్బుల్ వ్యాపారి నిర్లక్ష్యంతో మంగళవారం ఉదయం రెండు గంటల పాటు ట్రాఫిక్ అస్తవ్యస్తమవ్వడంతో పాటు ప్రసార మాధ్యమాల తీగలు తెగిపడ్డాయి. ఇసుకతోట సమీపంలో ఉన్న వర్ధమాన్ మార్బుల్స్ సెంటర్‌కు వాహనాలు వచ్చేందుకు రెండు దారులు ఏర్పాటు చేసుకున్నారు. ఒకటి ఆటోమోటివ్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఒకటి, మరొకటి జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గెడ్డపై అక్రమంగా ఇనుప రేకులతో నిర్మించినది. మంగళవారం తెల్లవారు జామున చెన్నై నుంచి వచ్చిన స్టాక్ లారీ దారి తెలియక ఇనుప బ్రిడ్జి పైనుంచి లోనికి ప్రవేశించేందుకు ప్రయత్నించింది. దీంతో లారీ ఇరుక్కుపోయింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు, మార్బుల్ దుకాణం వారు లారీ తొలగించేందుకు భారీ క్రేన్, చిన్న క్రేన్‌లను తీసుకువచ్చారు.ఉదయం 5 గంటల నుంచి లారీ తొలగించే పనులు చేపట్టారు. ఈ క్రేన్‌లు రెండూ రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ట్రాఫిక్‌ను పెద్ద రోడ్డు నుంచి హెచ్‌బీకాలనీ మీదుగా వెంకోజీపాలెం హైవేకు చేరుకునేలా మళ్లించారు. భారీ వాహనాలు సైతం హెచ్‌బీకాలనీ వైపు రావడంతో ఇక్కడున్న కేబుల్ వైర్లు, అక్కడక్కడ ఇళ్లకు సరఫరా అయ్యే విద్యుత్ వైర్లు తెగిపోయాయి. వాహనదారులు ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. ఆ తరువాత కేబుల్ సిబ్బంది, విద్యుత్ శాఖ వారు ఈ తెగిపడిన వైర్లను సరిచేసుకున్నారు. ఈ సమస్యకు కారణమైన వర్ధమాన్ మార్బుల్స్ యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పెద్ద గెడ్డపై అక్రమంగా బ్రిడ్జిని ఏర్పాటు చేసినా, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కళ్లుమూసుకోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



భారీ క్రేన్ సహాయంతో లారీని తొలగిస్తున్న దృశ్యం

ఈ రోడ్డు మాదిరో..ఎవరేమి సేతురో!

» ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని రీతిలో ఆక్రమణలు » ప్రైవేటు బస్సుల దందాకు బిత్తరపోతున్న ప్రయాణికులు » కిమ్మనని పోలీసులు



రామాటాకీస్ రోడ్డు అంబేడ్కర్ భవన్ ఎదురుగా పార్కింగ్ చేసిన బస్సులు

సీతమ్మధార, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రహదార్లలో రామాటాకీస్ నుంచి సత్యంకి వెళ్లే మార్గం కీలకమైనది. ఈ రోడ్డుపై తెల్లారింది మొదలు పెద్ద, చిన్న వాహనాలు వేల సంఖ్యలో పరుగులు పెడుతుంటాయి. ఇలాంటి ముఖ్య రహదారిలో సగానికి పైగా ఆక్రమించి ప్రైవేట్ బస్సులను పార్కింగ్ చేస్తుంటారు. రామాటాకీస్ సమీపంలోని ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి వద్ద, అంబేడ్కర్ భవన్ రోడ్డుపైన ఉదయం నుంచి రాత్రి వరకు ప్రైవేట్ బస్సులు ఒకదాని వెనుక మరొకటి మూడు, నాలుగు బస్సులు పార్కింగ్ చేసి ఉంచుతున్నారు. దీంతో ఈ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకుగా ఉన్న మార్గంలో బస్సుకు సమీపం నుంచి వెళ్లవలసి వస్తోంది. ఈ బస్సుల పక్క నుంచి కారు లేదా ట్రాన్స్‌పోర్టు వాహనం వెళ్తే ద్విచక్ర వాహనాదారులు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంటోంది. ప్రైవేటు బస్సులు ప్రయాణించేటప్పుడు, మలుపు తిరిగే సమయంలోనూ అటుగా ప్రయాణించే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోవలసి వస్తోంది. ఇతరుల ఇబ్బందులతో తమకు పనిలేదన్నట్లు.. ఈ బస్సుల డ్రైవర్లు రహదారికి అడ్డంగా పెట్టి నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తుంటారు. ఇతర వాహనదారులు అడిగితే కసురుకుంటారు. గట్టిగా ఎవరైనా అడిగితే ట్రాఫిక్ పోలీసులకు డబ్బులు చెల్లిస్తున్నామని కొందరు డ్రైవర్లు చెప్పటం శోచనీయం. వీరి ఆక్రమణల వ్యవహారం యథేచ్ఛగా సాగుతున్నా పోలీసు అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు పార్కింగ్ స్థలంగా వారికి పోలీసులు లేదా జీవీఎంసీ అధికారులు సూచించనప్పటికీ పెద్ద పెద్ద బస్సులను రహదారికి అడ్డంగా పెట్టి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. బస్సులు ఇలా రోడ్డుపై పార్కింగ్ చేయడం ఒక్క ఎత్తయితే ఉదయం ప్రయాణికులతో వచ్చిన బస్సులు వారు దిగి, లగేజి తీసుకువెళ్లే వరకు మరో వాహనం వెళ్లేందుకు దారి లేకుండా ఆక్రమించి తమ పని సజావుగా చేసుకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ట్రాన్స్‌పోర్టు సామగ్రిని సైతం బస్సు పక్క డోర్‌లు ఎత్తి ద్విచక్రవాహనం కూడా వెళ్లేందుకు వీలు లేకుండా తోపుడు రిక్షాలు, తొట్టి ఆటోలపై లగేజి ఎక్కిస్తుంటారు. ఉదయం 8 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇదే సమయంలో ఆ రహదారి గుండా విద్యాసంస్థలు, కార్యాలయాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదని, అప్పుడప్పుడు మొక్కుబడిగా ట్రాఫిక్ పోలీసులు వచ్చి కొద్దిసేపు హడావిడి చేసి వెళ్లిపోతుంటారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ రోడ్డులో ప్రైవేట్ బస్సులు నిలపకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


రామాటాకీస్ రోడ్డు ప్రభుత్వ కంటి ఆసుపత్రి వద్ద రోడ్డుపైనే నిలిపి లగేజి దింపుతున్న దృశ్యం

పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఉపాధ్యాయులకు కలెక్టర్ నిర్దేశం


స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, డీఈఓ ప్రేమ్‌కుమార్ తదితరులు

డాబాగార్డెన్స్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఈ విద్యా సంవత్సరం 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆకాంక్షించారు. జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం ఏఎస్సీఈఆర్టీ సహకారంతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఉపాధ్యాయులంతా విద్యార్థులతో వీటిని ఎక్కువ తర్ఫీదు చేయించి మన జిల్లాను మంచి స్థానంలో నిలపాలన్నారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని కచ్చితంగా ఆ విద్యార్థి ఉత్తీర్ణుడయ్యే బాధ్యత చేపట్టాలన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలపై సమాజానికి నమ్మకం కలుగుతుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పదో తరగతిలో ఉన్నతంగా లక్ష్యాలు చేరుకునేందుకు కృషి చేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ, చొరవ తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ జె.చంద్రశేఖర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పిల్లల ఆధార్ పూర్తికి ఆదేశం

డాబాగార్డెన్స్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 0-6 ఏళ్లలోపు పిల్లల ఆధార్‌ను నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరీంధర్‌ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ హాల్‌లో ఆధార్ డీఎల్‌ఎంసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 7,100 మంది పిల్లలకు ఆధార్‌ను రూపొందించడం పూర్తయిందన్నారు. ఇంకా మిగిలిన పిల్లల ఆధార్‌ను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఐపీబీటీ పోస్టర్ బ్యాంక్ చెల్లింపు, సీఎస్‌సీ సిబ్బంది ఇంటింటికీ, అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లల ఆధార్ ప్రక్రియను పూర్తి చేసేలా చూడాలన్నారు. ఆధార్ సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ తదితరాలకు సంబంధించిన పోస్టర్‌లను ప్రదర్శించాలని కలెక్టర్ నిర్దేశించారు. ఈ సమావేశంలో సి.ఉషారాణి, జావీద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇసుక లభ్యతపై మంత్రి రవీంద్ర సమీక్ష

డాబాగార్డెన్స్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం విశాఖ సర్క్యూట్ హౌస్‌లో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, విశాఖపట్నం మైనింగ్ ఏడీ, డీడీలతో సమావేశమయ్యారు. జిల్లాలోని ఇసుక లభ్యత, సరఫరా, స్టాక్ పాయింట్ల నిర్వహణపై చర్చించారు. మరో మూడు నెలల్లో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇసుక సర్దుబాటు గురించి ఆరా తీశారు. జిల్లాల్లో మైనింగ్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఎంఎఫ్ నిధుల వినియోగం, చేస్తున్న అభివృద్ధి పనులపై చర్చించారు. గనుల వ్యవస్థను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, అతిక్రమణలను ఉపేక్షించవద్దని అధికారులకు సూచించారు.

సచివాలయ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించండి

మహారాణిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయ వార్డు పరిపాలన కార్యదర్శులకు పదోన్నతి కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వార్డు పరిపాలనా కార్యదర్శులు పలువురు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్‌ను కోరారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. త్వరలోనే ఆయన సీడీఎంఏ కమిషనర్‌గా వెళ్లనున్న నేపథ్యంలో పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఆయనను కలిసినవారిలో ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు మహదేవ ఆనందరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, చింతకాయల బంగారు రాజు, సందీప్ కుమార్, బీవీ అశోక్‌కుమార్, సాయికృష్ణ, నానాజీ తదితరులు ఉన్నారు.


జీవీఎంసీ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సచివాలయ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు

ఆకతాయిల ఆగడాలపై గ్రామస్థుల ఫిర్యాదు


సీఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేస్తున్న ఆర్పీపేట గ్రామస్తులు

కంచరపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56వ వార్డు పరిధి రామ్మూర్తి పంతులపేటలో ఆకతాయిల బెడదతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని కంచరపాలెం క్రైం పోలీసులకు గ్రామస్థులు కొందరు ఫిర్యాదు చేశారు. ఆర్పీపేట అండర్‌పాస్ వే వద్ద కొంత మంది ఆకతాయిలు కాపలా కాసి ఒంటరిగా ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిని, పాదచారులను బెదిరించి వారి వద్ద నుంచి సెల్ ఫోన్లు, డబ్బులు లాక్కుని పారిపోతున్నారన్నారు. చీకటి పడగానే ఆకతాయిల హల్‌చల్ మితిమీరుతోందని, పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. నిఘాను ఏర్పాటు చేసి ఆకతాయిల ఆట కట్టిస్తామని సీఐ వారికి హామీ ఇచ్చారు.

పీఆర్‌సీ కోసం వినతి

మహారాణిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 12వ వేతన సంఘాన్ని తక్షణమే పునరుద్ధరించాలని యూటీఎఫ్ యూటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు కోరారు. మంగళవారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కలసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపునకు తేదీలు ప్రకటించాలని కోరారు. మెమో 57 ప్రకారం పాత పింఛన్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసినవారిలో కార్యదర్శి టి.ఆర్. అంబేడ్కర్, రాంబాబు, రియాజ్ అహ్మద్, టి.జగన్ పాల్గొన్నారు.

వయోవృద్ధుల సమస్యలపై సభలో చర్చిస్తా..

రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావు


మాట్లాడుతున్న ఎంపీ గొల్ల బాబూరావు

డాబాగార్డెన్స్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో వయోవృద్ధులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యసభలో లేవనెత్తి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ జిల్లా సీనియర్ సిటిజన్స్ సంఘం వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు.కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను కూడా వయోవృద్ధుడేనన్నారు. దేశంలోని వయోవృద్ధులంతా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని తాను సూర్యదేవుని ప్రార్థిస్తున్నానని తెలిపారు. నాగార్జున విశ్వవిశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వయోవృద్ధుల సామాజిక భవనం కోసం నగరాభివృద్ధి సంస్థ ద్వారా 1600 గజాలు కేటాయించారన్నారు. అప్పట్లో ఆ భవన నిర్మాణానికి మంత్రుల సమక్షంలో శంకుస్థాపన కూడా జరిగిందని, అయితే అది కార్యరూపం దాల్చలేదన్నారు. సంఘం అధ్యక్షుడు కె.మంగపతి, సెక్రటరీ డా. పి.కె.జోష్ మాట్లాడారు. వయోవృద్ధుల సంక్షేమ శాఖ జేడీ జె.మాధవి మాట్లాడుతూ వృద్ధులు స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వృద్ధుల హక్కులకు చట్టపరమైన రక్షణ ఉందన్నారు.

రహదారి ఆక్రమణల తొలగింపు


నక్కవానిపాలెంలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

సీతమ్మధార, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం ఎ.ఎం.జి. ఆసుపత్రి రోడ్డును ఆక్రమించి వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న తోపుడు బండ్లను, చిరువ్యాపారుల బడ్డీలను జీవీఎంసీ సిబ్బంది మంగళవారం తొలగించారు. పాత ఈనాడు కార్యాలయం ఎదురుగా, సీతమ్మధార రైతుబజార్ పక్క రోడ్డులో చిరు వ్యాపారులు రహదారిని ఇష్టానుసారంగా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో ఫిర్యాదులు అందుకున్న జీవీఎంసీ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది తొలగించారు. రహదారిని ఆక్రమించవద్దని హెచ్చరించారు.

ఉక్కు కార్మికులను రెచ్చగొట్టొద్దు

ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యధిక నష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంటుకు కేంద్రం రూ.11,440 కోట్ల ఆర్థిక సాయం చేస్తే దానిని కూడా కొందరు కార్మిక సంఘ నాయకులు వక్రీకరిస్తున్నారని, దయచేసి ఎవరూ కార్మికులను రెచ్చగొట్టవద్దని ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్ రాజు కోరారు. బీజేపీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కార్మిక సంఘ నాయకులు ధర్నాలు చేయడం వల్ల కేంద్రం సాయం చేయలేదని, కూటమి నాయకులు, డబుల్ ఇంజన్ సర్కారు చేసిన అనేక ప్రయత్నాల ఫలితంగా ఆర్థిక సాయం వచ్చిందన్న విషయం గుర్తెరగాలన్నారు. ఇది ఇష్టం లేనివారుంటే వీఆర్‌ఎస్ తీసుకొని వెళ్లిపోవచ్చునన్నారు. అంతే తప్ప అక్కడ వివాదాలు లేవనెత్తడం సరికాదన్నారు. ఉక్కు కర్మాగారాన్ని పైకి తేవడానికి ప్రధాని మోదీ ప్రభుత్వం అన్ని రకాల చేయూతలు ఇస్తుందన్నారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు డిమాండ్


జిల్లా కోర్టు వద్ద ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

మహారాణిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయ వాదులు ఆందోళన నిర్వహించారు. మంగళవారం జిల్లా కోర్టు వద్ద చేపట్టిన ఆందోళనలో న్యాయవాది పలకా శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండ నరేష్, శివాజీ, డి.పి. చంద్రశేఖర్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వైభవంగా పోలమాంబ జాతర


జాతరలో పాల్గొన్న జనం


విశేష అలంకరణలో పోలమాంబ అమ్మవారు

జగదాంబ కూడలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పోలమాంబ అమ్మవారి 67వ పరస మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. విశేష అలంకరణలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తన్మయులయ్యారు. తెల్లవారుజాము నుంచే మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కుమ్మరవీధి పరిసరాలు రాత్రి 11 గంటల వరకు జనంతో కిటకిటలాడాయి. సన్నాయి మేళాలు, పులివేషాలు, కాంతార-2 రూపం, తప్పెటగుళ్లు, సాముగరడీలు, సినీ పాటల ప్రదర్శన జాతరలో జనాన్ని అలరించాయి. వాచ్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన డాన్స్ బేబీ డాన్స్ షో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, ఇతర నాయకులు అమ్మవారికి పూజలు చేశారు. జాతర నిర్వాహక కమిటీ సభ్యులు నేతలను ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలి రావడంతో సాలిపేట, తాడివీధి, కుమ్మరవీధి పరిసరాలు నిండిపోయాయి. మహారాణిపేట పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు. చిరువ్యాపారాలు జోరుగా సాగాయి. విద్యుత్ దీప కాంతులతో ఆలయ పరిసరాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. ప్రశాంతంగా పోలమాంబ అమ్మవారి జాతర ముగిసింది.

సహకారం... ఇరకాటం

... 5వ పేజీ తరువాయి

సమయం తరువాత వాయిదాలు కట్టడం ఆపేసింది. సంస్థ పనితీరు గమనించిన బ్యాంకు 2022 ఆగస్టు నాటికి వడ్డీతో కలిపి ఇంకా రూ.129.62 కోట్లు బకాయి రావలసి ఉందని లెక్కలు తేల్చింది. సంస్థ ఆర్థిక స్థితిని అంచనా వేసి రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం ఆ బకాయిలు ఇక రావని, నిరర్థక ఆస్తి (నాన్ పెర్ఫార్మ్‌డ్ అసెట్-ఎన్‌పీఏ)గా నిర్ధారించింది. రుణం తీసుకున్న సంస్థకు, వారికి హామీదారుగా ఉన్న సూపర్‌బజార్ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చింది. తక్షణమే బకాయి కట్టకుంటే ఆస్తిని స్వాధీనం చేసుకుంటామని నోటీసులిచ్చింది.

లీజు పత్రాల తనఖా... హామీగా సూపర్ బజారు

లీజు వ్యవహారంలో ముంబై సంస్థ సుహానీ యాజమాన్యంతో అప్పటి కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ అధికారులు కుమ్మక్కయ్యారు. రుణం ఇవ్వాలంటే...లీజుకు ఇచ్చిన సంస్థ కూడా సంతకాలు చేయాలని ఆర్‌బీఎల్ బ్యాంకు డిమాండ్ చేయడంతో అధికారులు సంతకం చేశారు. దాంతో భూమిని బ్యాంకుకు హామీగా చూపించినట్టయింది. రుణం తీసుకున్న గ్రూపు దివాళా తీయడంతో అప్పు తీర్చాల్సిన బాధ్యత కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్‌పై పడింది. రూ.129.62 కోట్లకు నోటీసులు రావడంతో విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దాంతో విచారణకు ఆదేశించింది. సహకార శాఖకు చెందిన డీసీఏఓ శ్యామలను విచారణాధికారిగా నియమించారు. జిల్లాలో సహకార శాఖ జాయింట్ కలెక్టర్ పరిధిలోకి వస్తుంది. దీనిపై విచారణ జరుగుతోందని, మూడు వారాల తరువాత గానీ ఏ విషయం చెప్పలేమని అంటున్నారు.

సమర్థంగా పనిచేశాననే సంతృప్తితో వెళుతున్నా

... 5వ పేజీ తరువాయి

పూర్తయిందన్నారు. అలాగే జీవీఎంసీ పరిధిలో ఉన్న 1200 ఓపెన్ స్పేస్‌ల పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పరిశ్రమల నుంచి సీఎస్‌ఆర్ నిధులను తీసుకువచ్చి పచ్చదనం పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో కబ్జాలకు గురికాకుండా ఓపెన్ స్పేస్‌ల వద్ద బోర్డులు ఏర్పాటుచేయబోతున్నామన్నారు. అదేవిధంగా రెండేళ్లలో జీవీఎంసీ పరిధిలో శతశాతం తారురోడ్లు ఉండేలా ప్రణాళికలు తయారుచేశామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా జీవీఎంసీని మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. ప్రతి జోన్‌లో టౌన్ లెవల్ ఫెడరేషన్స్ (టీఎల్‌ఎఫ్) ద్వారా ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులు విక్రయించేలా దుకాణాలు కేటాయించి వారికి రుణ సదుపాయం కల్పించడంతోపాటు వ్యాపారులకు వస్తువులు సరఫరా చేసేందుకు వీలుగా రవాణా సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్-2025లో దేశంలోనే ఒకటి, రెండు ర్యాంకులను సాధించేందుకు వీలుగా నగరాన్ని అన్ని రంగాల్లోనూ సన్నద్ధం చేశామన్నారు. దేశంలోనే ఉత్తమ నగరంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన అర్హత విశాఖకు ఉందని సంపత్‌కుమార్ అభిప్రాయపడ్డారు.

ఆర్టీసీకి పండుగ

... 5వ పేజీ తరువాయి

ఎటువంటి అదనపు చార్జీలు తీసుకోలేదని వెల్లడించారు.

సగటు ఆక్యుపెన్సీ రేషియో 62 శాతం

ప్రత్యేక సర్వీసుల సగటు ఆక్యుపెన్సీ రేషియో 62 శాతంగా ఉంది. ప్రత్యేక సర్వీస్‌లలో ఒక వైపు ప్రయాణంలో 95 శాతం ఓఆర్ ఉంటే, తిరుగు ప్రయాణంలో 35 నుంచి 45 శాతం మాత్రమే ఉండేది. ఈ విధంగా సగటు ఆక్యుపెన్సీ రేషియో 62 శాతంగా నమోదైంది. కాగా, ప్రత్యేక సర్వీసులు ఈపీకే (కిలోమీటరుకు ఆదాయం) రూ.42 సాధించినట్టు అధికారులు లెక్కలు కట్టారు.

గత సంవత్సరం కంటే 50 శాతం ఎక్కువ

గత ఏడాది కంటే ఈసారి సుమారు 50 శాతం సర్వీస్‌లు ఎక్కువగా నడిపినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. గత ఏడాది సుమారు 750 ప్రత్యేక సర్వీసులను ఆపరేట్ చేయగా, ఈ ఏడాది 1,121 సర్వీసులు నడిపారు. ఆదాయం కూడా అదే నిష్పత్తిలో గత ఏడాది కంటే 50 శాతం ఎక్కువగా వచ్చినట్టు అధికారులు వెల్లడించారు. గత ఏడాది సంక్రాంతి స్పెషల్స్ ఆదాయం రూ.1.2 కోట్లు రాగా, ఈ ఏడాది రూ.1.8 కోట్లు వచ్చినట్టు రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు వెల్లడించారు.

25 నుంచి పంచాయతన యాగ మహోత్సవం

ఎం.వి.పి.కాలనీ,జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25, 26 తేదీల్లో ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలోసరస్వతీ సహిత పంచాయతన యాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు శారదాంబ విద్యానికేతన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఒక ప్రకటనలో తెలిపింది. 25న ఉదయం 8 గంటల నుంచి విష్వక్సేన ఆరాధన, హయగ్రీవ మాలామంత్ర హవనం, మధ్యాహ్నం 3 గంటలకు వేంకటేశ్వరస్వామి కల్యాణం, ఊంజల్ సేవ, సాయంత్రం ఆరు నుంచి సప్తవాద్య తరంగిణి, స్వరార్చన, భగవన్నామ సంకీర్తన, 26న ఉదయం విద్యార్థుల సామూహిక సరస్వతీ, మేధా దక్షిణామూర్తి కుంకుమార్చన, పంచాయతన హోమాలు, అన్న సమారాధన, సాయంత్రం నుంచి వీణానాదం,సంకీర్తనార్చన, కూచిపూడి నాట్య ప్రదర్శన ఉంటాయని సంస్థ అధ్యాపక బృందం తెలిపింది.

సుకన్య సమృద్ధి పథకంతో బాలికలకు మేలు

ఎంవీపీ కాలనీ,జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఈ నెల 24న నగరంలోని పోస్టాఫీసుల్లో సుకన్య సమృద్ధి పథకం ఖాతాలు తెరవాలని తపాలా శాఖ విశాఖపట్నం డివిజన్ సీనియర్ పర్యవేక్షణాధికారి గజేంద్ర కుమార్ మీనా ఒక ప్రకటనలో కోరారు. పదేళ్ల లోపు వయసు గల బాలికల పేరిట ఖాతా తెరవచ్చని, ఇందులో ఏడాదికి రూ.250 నుంచి రూ. 1.5 లక్షల వరకూ జమ చేసుకోవచ్చని తెలిపారు. బాలికలకు ప్రత్యేకమైన ఈ పథకంలో ఎక్కువ వడ్డీ పొందవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆడపిల్లల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు సర్వీస్ ప్రొవైడర్ల మేళా

ఆరిలోవ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : తోటగరువులో ఉన్న రాధాకృష్ణ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు సర్వీస్ ప్రొవైడర్ల మేళా నిర్వహించనున్నట్టు జీవీఎంసీ జోన్ టూ అధికారులు తెలిపారు. మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. మెప్మా, హోం ట్రయాంగిల్ సంస్థ సంయుక్తంగా ఈ మేళా నిర్వహిస్తున్నారన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ జట్టు మేనేజర్‌గా నారాయణరావు

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడల్లో పాల్గొంటున్న ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ జట్టుకు నగరానికి చెందిన ఎం.నారాయణరావు మేనేజర్‌గా నియమితులయ్యారు. ఫిబ్రవరి 8 నుంచి డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ క్రీడల్లో రాష్ట్ర అథ్లెటిక్స్ జట్టుకు మేనేజర్‌గా వ్యవహరిస్తారు. రాష్ట్ర అథ్లెటిక్స్ జట్టు సెలక్షన్ కమిటీ చైర్మన్, విశాఖ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్న నారాయణరావుకు స్పోర్ట్సు మేనేజ్‌మెంట్‌లో విశేష అనుభవం ఉంది. గత జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ మహిళల అథ్లెటిక్స్ జట్టు ఓవరాల్ రన్నరప్ ట్రోఫీ సాధించడంలో కీలక పాత్ర వహించారు. ఏఎఫ్ఐ జాతీయ స్థాయి టెక్నికల్ అఫీషియల్‌గా అర్హత కలిగిన నారాయణరావు.. ఏపీ అథ్లెటిక్స్ జట్టుకు మేనేజర్‌గా నియమితులు కావడంపై ఒలింపిక్, అథ్లెటిక్స్ సంఘాల ప్రతినిధులు హర్షం ప్రకటించారు.

సినిమా గైడ్

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 15, వంకాయలు (తెలుపు) 36,వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 18, క్యారెట్ 38 దొండకాయలు 40, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 32, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 45, పొటల్స్ 80, కీరదోస 34,కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 40, కంద 56, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50,కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

సంక్షేమానికి సర్వే బాట

» అర్హుల లబ్ధికి సర్వేలు
» తూర్పులో 98 శాతం జియో ట్యాగింగ్
» జోరుగా హౌస్ మ్యాపింగ్, పీఏసీఎస్ సర్వేలు



సర్వేలపై అవగాహన కల్పిస్తున్న అధికారి

మద్దిలపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వం సర్వే బాట పట్టింది. సాంకేతిక పరిజ్ఞానంతో పలు రకాల సర్వేలకు నాంది పలికింది. దీని ద్వారా అనర్హులను ఏరేసి, అర్హులకు న్యాయం చేసేలా చర్యలు ప్రారంభించింది. సచివాలయ సిబ్బంది ద్వారా ప్రతీ ఇంటిని సర్వే చేసి అర్హులను గుర్తించే పనిలో పడింది. తూర్పు నియోజకవర్గంలో 74 సచివాలయాల సిబ్బంది ప్రజల నివాసాలకు వెళ్లి సర్వే చేస్తున్నారు. సిరిపురం, పాండురంగాపురం, కిర్లంపూడి లేఅవుట్, ఎంవీపీకాలనీ ప్రాంత నివాసులు సర్వేలకు ఆసక్తి చూపడం లేదు. అటువంటి వారి వద్దకు అధికారులు వెళ్లి దీని ప్రాముఖ్యతను వివరిస్తున్నారు.

98 శాతం జియో ట్యాగింగ్ పూర్తి..

సచివాలయాల పరిధిలోని ప్రతీ ఇంటికి జియో ట్యాగింగ్ సర్వే నిర్వహించారు. ఇప్పటికే నియోజకవర్గంలో 98శాతం మ్యాపింగ్ పూర్తి చేశారు. ఇళ్లు మారిన వారు, ఇతర కారణాలతో ఇళ్లల్లో లేనివారి గృహాల మ్యాపింగ్ మాత్రమే పెండింగ్‌లో ఉంది. సచివాలయ సిబ్బంది ఇళ్లను సందర్శించి ఈ సర్వే పూర్తి చేశారు. సచివాలయాల పరిధిలోని ఇళ్లకు కార్యదర్శులు వెళ్లి వారి వివరాలు సేకరించి మ్యాపింగ్ చేశారు. ఇంటి సభ్యుల నుంచి ఒకరి ఆధార్ కార్డ్ ద్వారా వేలిముద్రలతో బయోమెట్రిక్ తీసుకుని, ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. దీని ద్వారా ఎవరు ఎక్కడ నివాసముంటున్నారు? ఆ ఇంటి సభ్యులు ఏమి వృత్తి చేస్తున్నారు, వారు సంక్షేమ పథకాలకు అర్హులా? కాదా? అనే విషయం ప్రభుత్వం తెలుసుకుంటోంది. అలాగే అదృశ్యమవుతున్న పౌరుల వివరాలు కూడా తెలుసుకుంటున్నారు. సంక్షేమ పథకాలు అందుకున్న వారు సచివాలయ పరిధిలో ఉన్నారా? లేదా? ఈ సర్వేలో తెలుసుకుంటున్నారు.

సొసైటీ సభ్యుల సర్వే...

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో సభ్యులైన రైతుల ధ్రువీకరణకు పీఏసీఎస్‌లో సర్వే నిర్వహిస్తున్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన చాలామంది తూర్పు నియోజకవర్గంలో నివాసముంటున్నారు. చాలా మందికి సొంత గ్రామాల్లో వ్యవసాయ భూములున్నాయి. గ్రామాల్లో భూ యజమానులు అందుబాటులో లేకపోవడంతో వారి వివరాలను నియోజకవర్గంలో నివాసముంటున్న సచివాలయాలకు పంపిస్తున్నారు. దీంతో ఇక్కడ సచివాలయ కార్యదర్శులు రైతు ధ్రువీకరణ సర్వే నిర్వహిస్తున్నారు. అన్ని రకాల సర్వేలు ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

పనుల నాణ్యతలో రాజీ వద్దు

వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ స్పష్టీకరణ



కారు పార్కింగ్ పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పనుల నాణ్యత విషయంలో క్షేత్రస్థాయిలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. మంగళవారం వీఎంఆర్డీఏ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తేదారులు నిర్దిష్ట కాల పరిమితికి లోబడి పనులు పూర్తి చేసేలా కార్యనిర్వాహక ఇంజనీర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. నాణ్యతలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్వహణ పనుల్లోనూ ఆడిటింగ్ చేసిన తరువాత మాత్రమే బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. అనంతరం మల్టీలెవల్ కారు పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించి ఫిబ్రవరి మొదటి వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ప్రారంభింపజేయడానికి సిద్ధం చేయాలన్నారు. ఇంజనీర్లకు అంతస్తుల వారీగా బాధ్యతలను అప్పగించాలని చెప్పారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, బలరామరాజు, సహాయ ఇంజనీర్లు పాల్గొన్నారు.

కైలాసగిరిపై పర్యాటకులకు పెద్ద పీట

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని,కొత్త కొత్త ప్రాజెక్టులు వస్తాయని, దానికి చెడ్డపేరు తెస్తే ఎవరినీ ఉపేక్షించమని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ హెచ్చరించారు. కైలాసగిరిపై వ్యాపారాలు చేసేవారిని కార్యాలయానికి పిలిపించి, వీఎంఆర్‌డీఏ సెక్రటరీ మురళీకృష్ణతో కలిసి మంగళవారం వారితో మాట్లాడారు. కైలాసగిరికి వచ్చే పర్యాటకులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, నిర్దేశించిన రేట్లనే వసూలు చేయాలని, ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదని సూచించారు. నిర్దేశించిన స్థలంలోనే వ్యాపారం చేసుకోవాలని, అదనపు స్థలాలు ఆక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. వీఎంఆర్‌డీఏ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న ప్రణవ్ గోపాల్

హైబ్రిడ్ సోలార్ డ్రైయర్

లడఖ్, కార్గిల్ రైతుల కోసం రూపొందించిన గీతం టెక్నాలజీ నిపుణులు

సాగర్‌నగర్ (విశాఖపట్నం), ఎండాడ 21 (ఆంధ్రజ్యోతి): ఏడాది పొడవునా అతి చల్లని వాతావరణం ఉండే లడఖ్, కార్గిల్ ప్రాంతాల్లో ఉద్యాన, వివిధ వ్యవసాయోత్పత్తులను మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా భద్రపరచడానికి వీలైన సాంకేతిక పరిజ్ఞానాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని గీతం టెక్నాలజీ ఎనేబిలింగ్ సెంటర్ (జి-టెక్) నిపుణులు అభివృద్ధి చేశారు. వీరు రూపొందించిన 'హైబ్రిడ్ సోలార్ డ్రైయర్'ను ఈనెల 19న లడఖ్‌లో జరిగిన కార్యక్రమంలో లడఖ్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్కే మెహతాకు అందజేశారు. జి-టెక్ నిపుణులు డాక్టర్ కేవీవీఎస్ఆర్ చంద్రమౌళి, గీతం విశిష్ట ప్రొఫెసర్ డాక్టర్ గురజాడ రవికుమార్, జి-టెక్ అధికారి సోంబట్‌శాస్త్రి సాంకేతిక పరిజ్ఞానంతో డ్రైయర్‌ను రూపొందించారు. ఇందులో తక్కువ వ్యయంతో ఉష్ణోగ్రతలను నియంత్రించే సెన్సార్‌లు ఉంటాయి. పగటిపూట గ్రహించిన సౌరశక్తిని నిల్వ చేసి రాత్రి సమయంలో తగు ఉష్ణోగ్రతల మధ్య పంటలను సంరక్షిస్తుంది. దీనివల్ల ఆహారోత్పత్తుల రంగు, రుచి వాసనలో మార్పులు ఉండవన్నారు. లడఖ్, కార్గిల్ ప్రాంతాలలో అధికంగా పండే ఆప్రికాట్, తదితర పండ్లను తేమ లేకుండా పొడి బారేలా చేయడం ద్వారా దీర్ఘకాలం నిల్వ చేసుకోవచ్చునని వెల్లడించారు. ఈ సందర్భంగా లడఖ్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఎస్.కె.మెహతా మాట్లాడుతూ సరైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేక తమ ప్రాంత రైతులు పంట దిగుబడిలో 60 శాతం వరకు కోల్పోతున్నారని, గీతం నిపుణులు రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం పంటలలో తేమ వల్ల జరిగే నష్టాలను నివారించి నాణ్యతతో కూడిన ఎగుమతులకు మార్గం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. విశ్వవిద్యాలయంలోని పరిశోధన ఫలితాలు క్షేత్రస్థాయిలో ఉపయోగపడడం అభినందనీయమన్నారు. జి-టెక్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడుతూ ఇటీవల మిజోరం రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ నిపుణులు అందజేశారన్నారు.ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం టీటీఐ డివిజన్ శాస్త్రవేత్త డాక్టర్ పి.కృష్ణకాంత్, అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చి శాస్త్రవేత్త డాక్టర్ సంజయ్‌కుమార్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం టెక్నాలజీ ఎనేబిలింగ్ సెంటర్ (హెచ్-టెక్) నిపుణులు డాక్టర్ జి.ఎస్.ప్రసాద్, ప్రొఫెసర్ ఎస్.రాజగోపాల్, డాక్టర్ బి.సునీల్, గీతం వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ అధిపతి వికాశ్‌కుమార్, శ్రీవాత్సవ, జి-టెక్ అసిస్టెంట్ మేనేజర్ అలేఖ్య మారం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ శశిభూషణరావు

తరగతుల నిర్వహణ పక్కాగా జరగాలి

- అధికారులకు వీసీ దిశా నిర్దేశం

వెంకోజీపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏయూలో పటిష్టంగా తరగతులు నిర్వహించే దిశగా ప్రధానాచార్యులు, విభాగాధిపతులు కృషి చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. మంగళవారం అకడమిక్ సెనేట్ మందిరంలో ప్రధానాచార్యులు, విభాగాధిపతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సెలవులు అనంతరం తరగతులు ప్రారంభమయ్యాయని, ప్రతి విభాగంలో పటిష్టంగా బోధన జరగాలని స్పష్టం చేశారు. ప్రధానాచార్యులు విభాగాలతో సమన్వయం చేస్తూ వీటిని పర్యవేక్షించాలని చెప్పారు. అకడమిక్ కార్యకలాపాలకు విభాగాల్లో అత్యంత ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. హాస్టళ్లను చీఫ్ వార్డెన్‌లు, సహాయక వార్డెన్‌లు నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. వీటి నిర్వహణపై తరచూ సమీక్షించాలని ప్రధానాచార్యులకు సూచించారు. విభాగాలు, హాస్టళ్లలో ఎలాంటి సదుపాయాలు అవసరమైనా వెంటనే ప్రతిపాదనలు తమకు పంపాలని వీసీ సూచించారు. విద్యార్థులకు అనుకూల పరిస్థితులు, సదుపాయాలను పూర్తిస్థాయిలో అందించడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

జపనీస్ భాషలో డిప్లొమా కోర్సు

వెంకోజీపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భాషా ఔత్సాహికులకు ఉత్తేజకరమైన పరిణామంలో, ఏయూ జపనీస్ భాషలో డిప్లొమా కోర్సు కోసం ప్రవేశాలు ప్రారంభించింది. విదేశీ భాషల విభాగాధిపతి, జపాన్ సమాచార, అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ నేతృత్వంలోని ఈ చొరవ నేటి ప్రపంచీకరణలో విదేశీ భాషా నైపుణ్యాలకు పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుంది.ఆసక్తిగల విద్యార్థులు, ఇతరులు ఏయూ అడ్మిషన్ల డైరెక్టర్ లేదా ఏయూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రెండో అంతస్తులోని విదేశీ భాషల విభాగాన్ని 90140 88901 నెంబరులో సంప్రదించాలని సూచించారు. మొత్తం 40 సీట్లతో ఆరు నెలల కోర్సు సాయంత్రం వేళల్లో తరగతులు నిర్వహిస్తారన్నారు. ఆర్థిక, విద్యా, సాంకేతిక పురోగతిని పెంపొందించడంలో ఇలాంటి భాగస్వామ్యాల అపారమైన సామర్థ్యాన్ని గుర్తించి,జపాన్‌తో విద్య, సాంస్కృతిక సహకారాన్ని పెంచడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ డిప్లొమా కోర్సు పరిచయం రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, సమాచార సాంకేతిక మంత్రి నారా లోకేశ్ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉందని రామకృష్ణ నొక్కి చెప్పారు. ఈ కోర్సు విద్యార్థులు, సాధారణ ప్రజలకు జపనీస్ భాషలో సమర్థంగా భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను అందించడానికి రూపొందించినట్లు చెప్పారు. తద్వారా అంతర్జాతీయ అవకాశాలకు తలుపులు తెరుస్తుందన్నారు. జపాన్ ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా, సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా ఉండటంతో, జపనీస్ మాట్లాడే సామర్థ్యం విలువైన ఆస్తిగా మారిందన్నారు. జపనీస్ సంబంధాలు ఉన్న కంపెనీలు, బహుళజాతి సంస్థలు, జపనీస్ మార్కెట్‌లోకి ప్రవేశించాలనుకునే సంస్థలు భాష, సంస్కృతిని నావిగేట్ చేయగల నిపుణులు అవసరమన్నారు. జపనీస్ మాట్లాడే నిపుణుల డిమాండ్ క్రమంగా పెరుగుతోందన్నారు. ఈ కోర్సు భాషపై పట్టు సాధించడానికి అధికారిక విద్యా మార్గాన్ని అందించడం ద్వారా ఈ అవసరాన్ని తీర్చడానికి ఉపకరిస్తుందన్నారు.

24న ఐటీఐలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గాజువాక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 24న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అమర్ రాజా గ్రూప్ వారు ఈ ఇంటర్వ్యూలను నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆ రోజు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9177338977 సెల్ నంబర్‌ను సంప్రందించాలని పేర్కొన్నారు.

నగర క్రీడా నిపుణుల ప్రతిభ

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 12 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక 38వ జాతీయ క్రీడలకు సాంకేతిక నిపుణులుగా నగరానికి చెందిన పలువురు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, బాక్సింగ్ సమాఖ్యల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీకి ఇంటర్నేషనల్ రిఫరీ కంచరాన సూర్యనారాయణ, స్విమ్మింగ్ పోటీలకు మోహన, వెంకటరామ్, బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీకి ద్రోణాచార్య అవార్డీ ఐ.వెంకటేశ్వరరావు, ఇండియన్ రైల్వే కోచ్ రెడ్డి శ్రీనివాసరావులు టెక్నికల్ అఫీషియల్స్‌గా వ్యవహరిస్తారు. వీరిని ఒలింపిక్ సంఘం విశాఖ ప్రతినిధులు అభినందించారు.

ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని జీఎంకు వినతి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జీఎం (స్టీల్ అండ్ మైన్స్) పీఎస్ రావును ఇంటక్ నాయకులు కోరారు. ప్లాంటులో మంగళవారం జీఎంతో ఇంటక్ నాయకులు సమావేశమై పలు అంశాలను వివరించారు. సకాలంలో జీతాలు అందరక ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు విభాగాల్లో సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణ ప్రకటనతో ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు తగిన సౌకర్యాలుకల్పించాలని వేడుకున్నారు.

రహదారి విస్తరణ వద్దని ఆందోళన



సచివాలయం వద్ద నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

పెందుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్ఆర్ పురంలో రహదారి విస్తరణ పనులు చేపడితే తాము ఆస్తులు కోల్పోయి తీవ్రంగా నష్టపోతామని, అందువల్ల పనులు నిలిపివేయాలంటూ మంగళవారం సర్పంచ్ దూది విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద ప్రజలు ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయకపోతే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. పేదల నివాసాలను తొలగించి అభివృద్ధి అంటారా అంటూ నిరసన వ్యక్తం చేశారు.



బాటిల్‌పై ఉన్న ఎమ్మార్పీ ధరను పరిశీలిస్తున్న కొల్లు రవీంద్ర

ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు

ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర

పెందుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఎమ్మార్పీ ధరలు ఉల్లంఘించే వారికి జరిమానాలు విధిస్తూ లైసెన్సులు రద్దు చేసేలా శాఖాపరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. మండలంలోని జెర్రిపోతులపాలెంలో గల ఏపీ ఐఎంఎఫ్ఎల్ మద్యం డిపోను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.డిపోలోని స్టాక్ రికార్డులను పరిశీలించారు. మద్యం కేసుల సరఫరాపై ఆరా తీశారు. బాటిళ్లపై ఉన్న లేబుళ్లను, ఎమ్మార్పీ ధరలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డిపోలోని కార్మికులతో మంత్రి కాసేపు ముచ్చటించారు. విశాఖ పరిధిలో మూడు మద్యం డిపోలు ఉన్నాయని జెర్రిపోతులపాలెం డిపోలో హమాలీల సంఖ్య ఎక్కువగా ఉన్నా, అందుకు తగ్గట్టు స్టాక్ సరఫరా లేదని పలువురు పేర్కొన్నారు. ఇక్కడి హమాలీలను మూడు డిపోల్లోకి సర్దుబాటు చేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు. అందుకు మంత్రి స్పందిస్తూ శాఖాపరంగా సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆ తర్వాత కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో బెల్ట్ షాపులు లేకుండా చేయడం, కల్తీ లేని మద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఉన్నారు.

పాతవెంకోజీపాలెంలో పరస రేపు

వెంకోజీపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాతవెంకోజీపాలెంలో సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో 23న పరస మహోత్సవం జరుగుతుందని సంఘం అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి పాత వెంకోజీపాలెం ప్రధాన రహదారిపై ఈ పరస మహోత్సవం జరుగుతుందన్నారు. ఆట వస్తువులు, గృహోపకరణాల విక్రయం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : సీఐ



ఎం.వి.పి.కాలనీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు ఇబ్బంది కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఎంవీపీ సీఐ జూరెడ్డి మురళి హెచ్చరించారు. గొడవల్లో తలదూర్చినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా రౌడీషీట్ తెరుస్తామని స్పష్టం చేశారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... కొన్ని కార్యక్రమాల్లో భారీగా సౌండ్ సిస్టమ్స్ వినియోగిస్తున్నారని, శబ్ద కాలుష్యం ఎక్కువగా ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. అదృశ్యం కేసుల్లో చురుగ్గా దర్యాప్తు చేసి, సంబంధిత వ్యక్తులను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నామని తెలిపారు. ఎంవీపీ కాలనీ స్టేషన్ పరిధిలో ఉన్న మురికివాడల నుంచి భార్యాభర్తల గొడవలు ఎక్కువగా వస్తున్నాయని, తరచూ కౌన్సెలింగ్ చేస్తున్నామని సీఐ తెలిపారు. న్యూసెన్స్, చీటింగ్ కేసులూ ఎక్కువగా ఉంటున్నాయన్నారు. తమ స్టేషన్ పరిధిలో ఉన్న 54 మంది రౌడీ షీటర్లపై నిఘా ఉంచామన్నారు. ఇటీవల పది మందిపై రౌడీ షీట్లు తెరిచినట్లు చెప్పారు. వీరి కదలికలపై ప్రతి కానిస్టేబుల్ ఓ కన్నేసి ఉంచేలా బాధ్యత అప్పగించామన్నారు. ప్రతి రౌడీషీటరు రోజూ తాము ఎక్కడున్నదీ లోకేషన్‌ను పంపించాల్సి ఉంటుందన్నారు. మహిళా కానిస్టేబుళ్ల కొరత కారణంగా ఎదురవుతున్న సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సీఐ తెలిపారు. పేకాట, బెట్టింగ్‌పై ప్రజలు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

దివ్యాంగ పింఛనర్లకు కంటి పరీక్షలు



పింఛన్‌దారుని కంటి పరీక్షలు పర్యవేక్షిస్తున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

మద్దిలపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కేటగిరిలో పింఛన్లు అందుకుంటున్న వారికి విశాఖ ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీపతి పర్యవేక్షణలో వైద్యులు పరీక్షలు చేపట్టారు. వందమంది అంధులకు తనిఖీలు నిర్వహించారు. వీరితో ఇద్దరు, ముగ్గురు సహాయకులు రావడంతో ఆసుపత్రి ఆవరణలో రద్దీ పెరిగింది. పరీక్షలు చేసుకుని ఇళ్లకు వేగంగా వెళ్లిపోవాలని పింఛన్‌దారులు హడావుడి చేయడంతో కాసేపు కంటి తనిఖీలు ఆపేశారు. ఒక్కొక్కరికి అయిదు నుంచి పది నిమిషాల సమయం పట్టడంతో పరీక్షలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఎవరు ఎప్పుడు తనిఖీకి రావాలన్నదీ సమాచారం ఇచ్చామని జోన్-3 ఏపీడీ రాము తెలిపారు.

అక్రమ బ్రిడ్జిపై ఇరుక్కుపోయిన లారీ

వెంకోజీపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మార్బుల్ వ్యాపారి నిర్లక్ష్యంతో మంగళవారం ఉదయం రెండు గంటల పాటు ట్రాఫిక్ అస్తవ్యస్తమవ్వడంతో పాటు ప్రసార మాధ్యమాల తీగలు తెగిపడ్డాయి. ఇసుకతోట సమీపంలో ఉన్న వర్ధమాన్ మార్బుల్స్ సెంటర్‌కు వాహనాలు వచ్చేందుకు రెండు దారులు ఏర్పాటు చేసుకున్నారు. ఒకటి ఆటోమోటివ్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఒకటి, మరొకటి జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గెడ్డపై అక్రమంగా ఇనుప రేకులతో నిర్మించినది. మంగళవారం తెల్లవారు జామున చెన్నై నుంచి వచ్చిన స్టాక్ లారీ దారి తెలియక ఇనుప బ్రిడ్జి పైనుంచి లోనికి ప్రవేశించేందుకు ప్రయత్నించింది. దీంతో లారీ ఇరుక్కుపోయింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు, మార్బుల్ దుకాణం వారు లారీ తొలగించేందుకు భారీ క్రేన్, చిన్న క్రేన్‌లను తీసుకువచ్చారు.ఉదయం 5 గంటల నుంచి లారీ తొలగించే పనులు చేపట్టారు. ఈ క్రేన్‌లు రెండూ రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ట్రాఫిక్‌ను పెద్ద రోడ్డు నుంచి హెచ్‌బీకాలనీ మీదుగా వెంకోజీపాలెం హైవేకు చేరుకునేలా మళ్లించారు. భారీ వాహనాలు సైతం హెచ్‌బీకాలనీ వైపు రావడంతో ఇక్కడున్న కేబుల్ వైర్లు, అక్కడక్కడ ఇళ్లకు సరఫరా అయ్యే విద్యుత్ వైర్లు తెగిపోయాయి. వాహనదారులు ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. ఆ తరువాత కేబుల్ సిబ్బంది, విద్యుత్ శాఖ వారు ఈ తెగిపడిన వైర్లను సరిచేసుకున్నారు. ఈ సమస్యకు కారణమైన వర్ధమాన్ మార్బుల్స్ యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పెద్ద గెడ్డపై అక్రమంగా బ్రిడ్జిని ఏర్పాటు చేసినా, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కళ్లుమూసుకోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



భారీ క్రేన్ సహాయంతో లారీని తొలగిస్తున్న దృశ్యం

ఈ రోడ్డు మాదిరో..ఎవరేమి సేతురో!

» ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని రీతిలో ఆక్రమణలు » ప్రైవేటు బస్సుల దందాకు బిత్తరపోతున్న ప్రయాణికులు » కిమ్మనని పోలీసులు



రామాటాకీస్ రోడ్డు అంబేడ్కర్ భవన్ ఎదురుగా పార్కింగ్ చేసిన బస్సులు

సీతమ్మధార, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రహదార్లలో రామాటాకీస్ నుంచి సత్యంకి వెళ్లే మార్గం కీలకమైనది. ఈ రోడ్డుపై తెల్లారింది మొదలు పెద్ద, చిన్న వాహనాలు వేల సంఖ్యలో పరుగులు పెడుతుంటాయి. ఇలాంటి ముఖ్య రహదారిలో సగానికి పైగా ఆక్రమించి ప్రైవేట్ బస్సులను పార్కింగ్ చేస్తుంటారు. రామాటాకీస్ సమీపంలోని ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి వద్ద, అంబేడ్కర్ భవన్ రోడ్డుపైన ఉదయం నుంచి రాత్రి వరకు ప్రైవేట్ బస్సులు ఒకదాని వెనుక మరొకటి మూడు, నాలుగు బస్సులు పార్కింగ్ చేసి ఉంచుతున్నారు. దీంతో ఈ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకుగా ఉన్న మార్గంలో బస్సుకు సమీపం నుంచి వెళ్లవలసి వస్తోంది. ఈ బస్సుల పక్క నుంచి కారు లేదా ట్రాన్స్‌పోర్టు వాహనం వెళ్తే ద్విచక్ర వాహనాదారులు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంటోంది. ప్రైవేటు బస్సులు ప్రయాణించేటప్పుడు, మలుపు తిరిగే సమయంలోనూ అటుగా ప్రయాణించే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోవలసి వస్తోంది. ఇతరుల ఇబ్బందులతో తమకు పనిలేదన్నట్లు.. ఈ బస్సుల డ్రైవర్లు రహదారికి అడ్డంగా పెట్టి నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తుంటారు. ఇతర వాహనదారులు అడిగితే కసురుకుంటారు. గట్టిగా ఎవరైనా అడిగితే ట్రాఫిక్ పోలీసులకు డబ్బులు చెల్లిస్తున్నామని కొందరు డ్రైవర్లు చెప్పటం శోచనీయం. వీరి ఆక్రమణల వ్యవహారం యథేచ్ఛగా సాగుతున్నా పోలీసు అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు పార్కింగ్ స్థలంగా వారికి పోలీసులు లేదా జీవీఎంసీ అధికారులు సూచించనప్పటికీ పెద్ద పెద్ద బస్సులను రహదారికి అడ్డంగా పెట్టి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. బస్సులు ఇలా రోడ్డుపై పార్కింగ్ చేయడం ఒక్క ఎత్తయితే ఉదయం ప్రయాణికులతో వచ్చిన బస్సులు వారు దిగి, లగేజి తీసుకువెళ్లే వరకు మరో వాహనం వెళ్లేందుకు దారి లేకుండా ఆక్రమించి తమ పని సజావుగా చేసుకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ట్రాన్స్‌పోర్టు సామగ్రిని సైతం బస్సు పక్క డోర్‌లు ఎత్తి ద్విచక్రవాహనం కూడా వెళ్లేందుకు వీలు లేకుండా తోపుడు రిక్షాలు, తొట్టి ఆటోలపై లగేజి ఎక్కిస్తుంటారు. ఉదయం 8 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇదే సమయంలో ఆ రహదారి గుండా విద్యాసంస్థలు, కార్యాలయాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదని, అప్పుడప్పుడు మొక్కుబడిగా ట్రాఫిక్ పోలీసులు వచ్చి కొద్దిసేపు హడావిడి చేసి వెళ్లిపోతుంటారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ రోడ్డులో ప్రైవేట్ బస్సులు నిలపకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రామాటాకీస్ రోడ్డు ప్రభుత్వ కంటి ఆసుపత్రి వద్ద రోడ్డుపైనే నిలిపి లగేజి దింపుతున్న దృశ్యం

పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఉపాధ్యాయులకు కలెక్టర్ నిర్దేశం



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, డీఈఓ ప్రేమ్‌కుమార్ తదితరులు

డాబాగార్డెన్స్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఈ విద్యా సంవత్సరం 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆకాంక్షించారు. జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం ఏఎస్సీఈఆర్టీ సహకారంతో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఉపాధ్యాయులంతా విద్యార్థులతో వీటిని ఎక్కువ తర్ఫీదు చేయించి మన జిల్లాను మంచి స్థానంలో నిలపాలన్నారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని కచ్చితంగా ఆ విద్యార్థి ఉత్తీర్ణుడయ్యే బాధ్యత చేపట్టాలన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలపై సమాజానికి నమ్మకం కలుగుతుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ పదో తరగతిలో ఉన్నతంగా లక్ష్యాలు చేరుకునేందుకు కృషి చేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ, చొరవ తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ జె.చంద్రశేఖర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పిల్లల ఆధార్ పూర్తికి ఆదేశం

డాబాగార్డెన్స్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 0-6 ఏళ్లలోపు పిల్లల ఆధార్‌ను నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరీంధర్‌ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ హాల్‌లో ఆధార్ డీఎల్ఏఎంసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 7,100 మంది పిల్లలకు ఆధార్‌ను రూపొందించడం పూర్తయిందన్నారు. ఇంకా మిగిలిన పిల్లల ఆధార్‌ను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఐపీబీపీ పోస్టర్ బ్యాంక్ చెల్లింపు, సీఎస్‌సీ సిబ్బంది ఇంటింటికీ, అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లల ఆధార్ ప్రక్రియను పూర్తి చేసేలా చూడాలన్నారు. ఆధార్ సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ తదితరాలకు సంబంధించిన పోస్టర్‌లను ప్రదర్శించాలని కలెక్టర్ నిర్దేశించారు. ఈ సమావేశంలో సి.ఉషారాణి, జావీద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలపై గ్రామస్థుల ఫిర్యాదు



సీఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేస్తున్న ఆర్పీపేట గ్రామస్తులు

కంచరపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 56వ వార్డు పరిధి రామ్మూర్తి పంతులపేటలో ఆకతాయిల బెడదతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని కంచరపాలెం క్రైం పోలీసులకు గ్రామస్థులు కొందరు ఫిర్యాదు చేశారు. ఆర్పీపేట అండర్‌పాస్ వే వద్ద కొంత మంది ఆకతాయిలు కాపలా కాసి ఒంటరిగా ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిని, పాదచారులను బెదిరించి వారి వద్ద నుంచి సెల్ ఫోన్లు, డబ్బులు లాక్కుని పారిపోతున్నారన్నారు. చీకటి పడగానే ఆకతాయిల హల్‌చల్ మితిమీరుతోందని, పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. క్రైం సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. నిఘాను ఏర్పాటు చేసి ఆకతాయిల ఆట కట్టిస్తామని సీఐ వారికి హామీ ఇచ్చారు.

వయోవృద్ధుల సమస్యలపై సభలో చర్చిస్తా..

రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావు



మాట్లాడుతున్న ఎంపీ గొల్ల బాబూరావు

డాబాగార్డెన్స్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో వయోవృద్ధులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యసభలో లేవనెత్తి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ జిల్లా సీనియర్ సిటిజన్స్ సంఘం వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు.కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను కూడా వయోవృద్ధుడేనన్నారు. దేశంలోని వయోవృద్ధులంతా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని తాను సూర్యదేవుని ప్రార్థిస్తున్నానని తెలిపారు. నాగార్జున విశ్వవిశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వయోవృద్ధుల సామాజిక భవనం కోసం నగరాభివృద్ధి సంస్థ ద్వారా 1600 గజాలు కేటాయించారన్నారు. అప్పట్లో ఆ భవన నిర్మాణానికి మంత్రుల సమక్షంలో శంకుస్థాపన కూడా జరిగిందని, అయితే అది కార్యరూపం దాల్చలేదన్నారు. సంఘం అధ్యక్షుడు కె.మంగపతి, సెక్రటరీ డా. పి.కె.జోష్ మాట్లాడారు. వయోవృద్ధుల సంక్షేమ శాఖ జేడీ జె.మాధవి మాట్లాడుతూ వృద్ధులు స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వృద్ధుల హక్కులకు చట్టపరమైన రక్షణ ఉందన్నారు.

ఇసుక లభ్యతపై మంత్రి రవీంద్ర సమీక్ష

డాబాగార్డెన్స్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం విశాఖ సర్క్యూట్ హౌస్‌లో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, విశాఖపట్నం మైనింగ్ ఏడీ, డీడీలతో సమావేశమయ్యారు. జిల్లాలోని ఇసుక లభ్యత, సరఫరా, స్టాక్ పాయింట్ల నిర్వహణపై చర్చించారు. మరో మూడు నెలల్లో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇసుక సర్దుబాటు గురించి ఆరా తీశారు. జిల్లాల్లో మైనింగ్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఎంఎఫ్ నిధుల వినియోగం, చేస్తున్న అభివృద్ధి పనులపై చర్చించారు. గనుల వ్యవస్థను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, అతిక్రమణలను ఉపేక్షించవద్దని అధికారులకు సూచించారు.

పీఆర్‌సీ కోసం వినతి

మహారాణిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 12వ వేతన సంఘాన్ని తక్షణమే పునరుద్ధరించాలని యూటీఎఫ్ యూటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు కోరారు. మంగళవారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కలసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపునకు తేదీలు ప్రకటించాలని కోరారు. మెమో 57 ప్రకారం పాత పింఛన్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసినవారిలో కార్యదర్శి టి.ఆర్. అంబేడ్కర్, రాంబాబు, రియాజ్ అహ్మద్, టి.జగన్ పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణల తొలగింపు



నక్కవానిపాలెంలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

సీతమ్మధార, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం ఎ.ఎం.జి. ఆసుపత్రి రోడ్డును ఆక్రమించి వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న తోపుడు బండ్లను, చిరువ్యాపారుల బడ్డీలను జీవీఎంసీ సిబ్బంది మంగళవారం తొలగించారు. పాత ఈనాడు కార్యాలయం ఎదురుగా, సీతమ్మధార రైతుబజార్ పక్క రోడ్డులో చిరువ్యాపారులు రహదారిని ఇష్టానుసారంగా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో ఫిర్యాదులు అందుకున్న జీవీఎంసీ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది తొలగించారు. రహదారిని ఆక్రమించవద్దని హెచ్చరించారు.

ఉక్కు కార్మికులను రెచ్చగొట్టొద్దు

ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యధిక నష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంటుకు కేంద్రం రూ.11,440 కోట్ల ఆర్థిక సాయం చేస్తే దానిని కూడా కొందరు కార్మిక సంఘ నాయకులు వక్రీకరిస్తున్నారని, దయచేసి ఎవరూ కార్మికులను రెచ్చగొట్టవద్దని ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్ రాజు కోరారు. బీజేపీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కార్మిక సంఘ నాయకులు ధర్నాలు చేయడం వల్ల కేంద్రం సాయం చేయలేదని, కూటమి నాయకులు, డబుల్ ఇంజన్ సర్కారు చేసిన అనేక ప్రయత్నాల ఫలితంగా ఆర్థిక సాయం వచ్చిందన్న విషయం గుర్తెరగాలన్నారు. ఇది ఇష్టం లేనివారుంటే వీఆర్ఎస్ తీసుకొని వెళ్లిపోవచ్చునన్నారు. అంతే తప్ప అక్కడ వివాదాలు లేవనెత్తడం సరికాదన్నారు. ఉక్కు కర్మాగారాన్ని పైకి తేవడానికి ప్రధాని మోదీ ప్రభుత్వం అన్ని రకాల చేయూతలు ఇస్తుందన్నారు.

సచివాలయ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించండి



జీవీఎంసీ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సచివాలయ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు

మహారాణిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయ వార్డు పరిపాలన కార్యదర్శులకు పదోన్నతి కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వార్డు పరిపాలనా కార్యదర్శులు పలువురు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్‌ను కోరారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. త్వరలోనే ఆయన సీడీఎంఏ కమిషనర్‌గా వెళ్లనున్న నేపథ్యంలో పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఆయనను కలిసినవారిలో ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు మహదేవ ఆనందరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, చింతకాయల బంగారు రాజు, సందీప్ కుమార్, బీవీ అశోక్‌కుమార్, సాయికృష్ణ, నానాజీ తదితరులు ఉన్నారు.

ఘనంగా కైలాసనాథుని ఆలయ వార్షికోత్సవం

విశాలాక్షినగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరిపై ఉన్న కైలాసనాథుని ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అర్చకుడు కాశీబాబు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో సుమారు వెయ్యి మందికి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేజెళ్ల సుబ్బరాజు, అక్కరబోయిన రాంబాబు, వెలగపూడి శ్యామలరావు పాల్గొన్నారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు డిమాండ్



జిల్లా కోర్టు వద్ద ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

మహారాణిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయ వాదులు ఆందోళన నిర్వహించారు. మంగళవారం జిల్లా కోర్టు వద్ద చేపట్టిన ఆందోళనలో న్యాయవాది పలకా శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండ నరేష్, శివాజీ, డి.పి. చంద్రశేఖర్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సహకారం... ఇరకాటం

... 5వ పేజీ తరువాయి

సమయం తరువాత వాయిదాలు కట్టడం ఆపేసింది. సంస్థ పనితీరు గమనించిన బ్యాంకు 2022 ఆగస్టు నాటికి వడ్డీతో కలిపి ఇంకా రూ.129.62 కోట్లు బకాయి రావలసి ఉందని లెక్కలు తేల్చింది. సంస్థ ఆర్థిక స్థితిని అంచనా వేసి రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం ఆ బకాయిలు ఇక రావని, నిరర్థక ఆస్తి (నాన్ పెర్ఫార్మ్‌డ్ అసెట్-ఎన్‌పీఏ)గా నిర్ధారించింది. రుణం తీసుకున్న సంస్థకు, వారికి హామీదారుగా ఉన్న సూపర్‌బజార్ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చింది. తక్షణమే బకాయి కట్టకుంటే ఆస్తిని స్వాధీనం చేసుకుంటామని నోటీసులిచ్చింది.

లీజు పత్రాల తనఖా...

హామీగా సూపర్ బజారు

లీజు వ్యవహారంలో ముంబై సంస్థ సుహానీ యాజమాన్యంతో అప్పటి కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ అధికారులు కుమ్మక్కయ్యారు. రుణం ఇవ్వాలంటే...లీజుకు ఇచ్చిన సంస్థ కూడా సంతకాలు చేయాలని ఆర్‌బీఎల్ బ్యాంకు డిమాండ్ చేయడంతో అధికారులు సంతకం చేశారు. దాంతో భూమిని బ్యాంకుకు హామీగా చూపించినట్టయింది. రుణం తీసుకున్న గ్రూపు దివాళా తీయడంతో అప్పు తీర్చాల్సిన బాధ్యత కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్‌పై పడింది. రూ.129.62 కోట్లకు నోటీసులు రావడంతో విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దాంతో విచారణకు ఆదేశించింది. సహకార శాఖకు చెందిన డీసీఏఓ శ్యామలను విచారణాధికారిగా నియమించారు. జిల్లాలో సహకార శాఖ జాయింట్ కలెక్టర్ పరిధిలోకి వస్తుంది. దీనిపై విచారణ జరుగుతోందని, మూడు వారాల తరువాత గానీ ఏ విషయం చెప్పలేమని అంటున్నారు.

సమర్థంగా పనిచేశాననే సంతృప్తితో వెళుతున్నా

... 5వ పేజీ తరువాయి

పూర్తయిందన్నారు. అలాగే జీవీఎంసీ పరిధిలో ఉన్న 1200 ఓపెన్ స్పేస్‌ల పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులను తీసుకువచ్చి పచ్చదనం పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో కబ్జాలకు గురికాకుండా ఓపెన్ స్పేస్‌ల వద్ద బోర్డులు ఏర్పాటుచేయబోతున్నామన్నారు. అదేవిధంగా రెండేళ్లలో జీవీఎంసీ పరిధిలో శతశాతం తారురోడ్లు ఉండేలా ప్రణాళికలు తయారుచేశామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా జీవీఎంసీని మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. ప్రతి జోన్‌లో టౌన్ లెవల్ ఫెడరేషన్స్ (టీఎల్ఎఫ్) ద్వారా ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులు విక్రయించేలా దుకాణాలు కేటాయించి వారికి రుణ సదుపాయం కల్పించడంతోపాటు వ్యాపారులకు వస్తువులు సరఫరా చేసేందుకు వీలుగా రవాణా సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్-2025లో దేశంలోనే ఒకటి, రెండు ర్యాంకులను సాధించేందుకు వీలుగా నగరాన్ని అన్ని రంగాల్లోనూ సన్నద్ధం చేశామన్నారు. దేశంలోనే ఉత్తమ నగరంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన అర్హత విశాఖకు ఉందని సంపత్‌కుమార్ అభిప్రాయపడ్డారు.



లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వచ్చే నెలలో హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలు

భీమునిపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను అందరి భాగస్వామ్యంతో విజయ వంతం చేద్దామని హైస్కూల్ శతాబ్ది ఉత్సవ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం పాఠశాలలో జరి గిన ఉత్సవ సన్నాహక సమావేశంలో ఆయనమాట్లాడారు. దేశ వ్యాప్తంగా వందేళ్లు పూర్తి చేసుకున్న హైస్కూళ్లు చాలా అరుదుగా ఉన్నాయని, వాటి సరసన భీమిలి ఉన్నత పాఠశాల చేరడం మనకు గర్వకారణమన్నారు. ఉత్సవాలను ఆశీర్వదిస్తూ సావనీర్‌కు ప్రధాని మోదీ ప్రత్యేక సందేశం పంపారని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖా మంత్రి, తదితరుల నుంచి కూడా సందేశాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు.వచ్చే నెల 1, 2 తేదీల్లో జరిగే ఈ ఉత్సవాలకు మంత్రి లోకేశ్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈమేరకు పాఠశాల సుందరీకరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా సంపూర్ణ సహకారం అందించి, ఉత్సవాలను విజయవంతం చేస్తామని తెలిపారు. ఇప్పటికే డీఈఓ నోడల్ అధికారిగా పలు కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు.

వైభవంగా పోలమాంబ జాతర



జాతరలో పాల్గొన్న జనం



విశేష అలంకరణలో పోలమాంబ అమ్మవారు

జగదాంబ కూడలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పోలమాంబ అమ్మవారి 67వ పరస మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. విశేష అలంకరణలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తన్మయులయ్యారు. తెల్లవారుజాము నుంచే మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కుమ్మరవీధి పరిసరాలు రాత్రి 11 గంటల వరకు జనంతో కిటకిటలాడాయి. సన్నాయి మేళాలు, పులివేషాలు, కాంతార-2 రూపం, తప్పెటగుళ్లు, సాముగరడీలు, సినీ పాటల ప్రదర్శన జాతరలో జనాన్ని అలరించాయి. వాచ్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన డాన్స్ బేబీ డాన్స్ షో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, ఇతర నాయకులు అమ్మవారికి పూజలు చేశారు. జాతర నిర్వాహక కమిటీ సభ్యులు నేతలను ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలి రావడంతో సాలిపేట, తాడివీధి, కుమ్మరవీధి పరిసరాలు నిండిపోయాయి. మహారాణిపేట పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు. చిరువ్యాపారాలు జోరుగా సాగాయి. విద్యుత్ దీప కాంతులతో ఆలయ పరిసరాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. ప్రశాంతంగా పోలమాంబ అమ్మవారి జాతర ముగిసింది.

ఆర్టీసీకి పండుగ

... 5వ పేజీ తరువాయి

ఎటువంటి అదనపు చార్జీలు తీసుకోలేదని వెల్లడించారు.

సగటు ఆక్యుపెన్సీ రేషియో 62 శాతం

ప్రత్యేక సర్వీసుల సగటు ఆక్యుపెన్సీ రేషియో 62 శాతంగా ఉంది. ప్రత్యేక సర్వీస్‌లలో ఒక వైపు ప్రయాణంలో 95 శాతం ఓఆర్ ఉంటే, తిరుగు ప్రయాణంలో 35 నుంచి 45 శాతం మాత్రమే ఉండేది. ఈ విధంగా సగటు ఆక్యుపెన్సీ రేషియో 62 శాతంగా నమోదైంది. కాగా, ప్రత్యేక సర్వీసులు ఈపీకే (కిలోమీటరుకు ఆదాయం) రూ.42 సాధించినట్టు అధికారులు లెక్కలు కట్టారు.

గత సంవత్సరం కంటే 50 శాతం ఎక్కువ

గత ఏడాది కంటే ఈసారి సుమారు 50 శాతం సర్వీస్‌లు ఎక్కువగా నడిపినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. గత ఏడాది సుమారు 750 ప్రత్యేక సర్వీసులను ఆపరేట్ చేయగా, ఈ ఏడాది 1,121 సర్వీసులు నడిపారు. ఆదాయం కూడా అదే నిష్పత్తిలో గత ఏడాది కంటే 50 శాతం ఎక్కువగా వచ్చినట్టు అధికారులు వెల్లడించారు. గత ఏడాది సంక్రాంతి స్పెషల్స్ ఆదాయం రూ.1.2 కోట్లు రాగా, ఈ ఏడాది రూ.1.8 కోట్లు వచ్చినట్టు రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు వెల్లడించారు.

సిద్ధార్థనగర్ కాలనీ సమస్య పరిష్కారమయ్యేనా!

- '22-ఏ'లో ఉండడంతో మూడున్నర దశాబ్దాలుగా ఇళ్ల క్రయ విక్రయాలు బంద్
- అత్యవసరాలకు విక్రయించడానికి వీల్లేకుండా పోతుందని కాలనీవాసుల ఆవేదన



87వ వార్డు పరిధిలోని సిద్ధార్థనగర్ కాలనీ

కూర్మన్నపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాక సంస్థ (జీవీఎంసీ) 87వ వార్డు పరిధి కణితి కాళింగుల వీధి సమీపంలోని సిద్ధార్థనగర్ కాలనీని 22-ఏ సమస్య మూడున్నర దశాబ్దాలుగా వేధిస్తోంది. 1987లో బీహెచ్‌పీవీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు కొందరు తమకు ఇళ్ల స్థలాలను కేటాయించవలసిందిగా నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డిని వేడుకున్నారు. దీంతో వడ్లపూడి సర్వే నంబర్-1 పార్టు-5లోని రాతి చెరువులో తొమ్మిది ఎకరాల స్థలాన్ని ప్రభుత్వ ధరకు వాళ్లకు కేటాయించారు. బీహెచ్‌పీవీలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులంతా బీహెచ్‌పీవీ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా తొమ్మిది ఎకరాలకు గాను రూ.రెండు లక్షల 80 వేలు చెల్లించి సొసైటీ పేరున కేటాయింపు చేయించుకున్నారు. ఈ సొసైటీలో 350 మంది సభ్యులుండగా 272 మందికి మాత్రమే ప్లాట్లు కేటాయించారు. వీరిలో చాలామంది ఇళ్లు నిర్మించుకోగా, మిగిలిన 78 మందికి ఇప్పటికీ కేటాయింపులు జరగలేదు. సొసైటీకి కేటాయించిన మొత్తం భూమిని ప్రభుత్వ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా (22-ఏ జాబితాలో) చూపుతున్నారు. ఈ కారణంగా కాలనీలో ఇంతవరకు నిర్మించుకున్న ప్లాట్లు అమ్మకాలు, కొనుగోలు నిలిచిపోయాయని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల పునర్నిర్మాణం కోసం కానీ ఆధునికీకరణ చేసుకునేందుకు గానీ జీవీఎంసీ అనుమతులు ఇవ్వడం లేదని వాపోతున్నారు. అలాగే బ్యాంకులు కూడా లోన్లు మంజూరు చేయడం లేదు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇతర అవసరాల నిమిత్తం ప్లాట్లను విక్రయిద్దామంటే తమకు ఇక్కట్లు తప్పడం లేదని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు.

కాలనీ పక్కనే ఉన్న స్థలాన్ని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు కేటాయించిన నేపథ్యంలో.. మిగిలిన వారికి సమీపంలో మరోచోట కేటాయింపులు జరపాలని వారు కోరుతున్నారు. ఇటీవల వడ్లపూడిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఈ విషయంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీవల్లి దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లామని కాలనీ ప్రతినిధి బలిరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. ఛికాగా ప్రభుత్వ భూములకు సంబంధించిన జాబితా 22-ఏ నుంచి ప్రభుత్వేతర భూముల వివరాలు తొలగింపుపై జిల్లా యంత్రాంగం దృష్టిసారించినందున సిద్ధార్థనగర్ కాలనీ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.



మద్యం బాటిల్‌పై ఉన్న ఎమ్మార్పీని పరిశీలిస్తున్న కొల్లు రవీంద్ర

ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు

ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర

పెందుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఎమ్మార్పీ ధరలు ఉల్లంఘించే వారికి జరిమానాలు విధిస్తూ లైసెన్సులు రద్దు చేసేలా శాఖాపరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. మండలంలోని జెర్రిపోతులపాలెంలో గల ఏపీ ఐఎంఎఫ్ఎల్ మద్యం డిపోను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలోని స్టాక్ రికార్డులను పరిశీలించారు. మద్యం కేసుల సరఫరాపై ఆరా తీశారు. బాటిళ్లపై ఉన్న లేబుళ్లను, ఎమ్మార్పీ ధరలను క్షుణ్ణంగా పరిశీలించారు.

అనంతరం డిపోలోని కార్మికులతో మంత్రి కాసేపు ముచ్చటించారు. విశాఖ పరిధిలో మూడు మద్యం డిపోలు ఉన్నాయని జెర్రిపోతులపాలెం డిపోలో హమాలీల సంఖ్య ఎక్కువగా ఉన్నా, అందుకు తగ్గట్టు స్టాక్ సరఫరా లేదని పలువురు పేర్కొన్నారు. ఇక్కడి హమాలీలను మూడు డిపోల్లోకి సర్దుబాటు చేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు. అందుకు మంత్రి స్పందిస్తూ శాఖాపరంగా సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆ తర్వాత కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో బెల్ట్ షాపులు లేకుండా చేయడం, కల్తీ లేని మద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఉన్నారు.

ప్రజా వేదికల ద్వారా సమస్యలను పరిష్కరిస్తాం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు



ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వేదిక కార్యక్రమాల ద్వారా నేరుగా ప్రజలను కలుసుకుని వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 59వ వార్డు పరిధి ములగాడ హౌసింగ్ కాలనీలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు కృషి వల్లే స్టీల్‌ప్లాంటును ఊపిరి వచ్చిందన్నారు. రానున్న కాలంలో రాష్ట్రంలో అనేక పరిశ్రమలు రానున్నందున ఎంతోమందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రజల సమస్యలకు సంబంధించి వినతిపత్రాలను స్వీకరించారు. వీటిలో అధికంలో ఇంటి పన్నుల్లో పేర్ల మార్పు, పింఛన్లు మంజూరు చేయాలని, ఆధార్ కార్డుల మార్పులు, చేర్పుల కోసం వినతిపత్రాలు అందాయి. కాగా మాజీ సైనికుల కాలనీలో 22-ఏలో ఉన్న ఖాళీ స్థలాలు, ఇళ్లను ఆ జాబితా నుంచి తప్పించాలని కోరుతూ టీడీపీ అర్బన్ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ సైనికుల కాలనీ అధ్యక్షుడు పాండ్రంగి జయరాజు ప్రజా దర్బార్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ములగాడ తహసీల్దార్ ఎం.భుజంగరావు, జోన్-5 కమిషనర్ రాము, టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి మిలిరెడ్డి శంకర్, పలు విభాగాల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

24న గాజువాక ఐటీఐలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

గాజువాక, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గాజువాక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 24న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అమర్ రాజా గ్రూప్ వారు ఈ ఇంటర్వ్యూలను నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆ రోజు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9177338977 సెల్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు..: 'పంచకర్ల'



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పంచకర్ల

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 77వ వార్డులో మంగళవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ఓ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో పాటు రాష్ట్ర అన్ని రంగాల్లో ముందుండేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను స్థానిక నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, మాజీ కార్పొరేటర్ గొర్లె వెంకునాయుడు, కాకి బాబు, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణ తొలగింపు



ఆక్రమిత స్థలంలో నిర్మించిన గోడను తొలగిస్తున్న సిబ్బంది

గోపాలపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థల ఆక్రమణపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. 92వ వార్డు పరిధి నందమూరి నగర్ సర్వే నంబర్-76లోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు స్థానికులు ఆక్రమించి గోడను నిర్మించారు. ఈ ఆక్రమణపై రెవెన్యూ అధికారులకు పలువురు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ సీహెచ్ రమేశ్ ఆదేశాల మేరకు ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన గోడను రెవెన్యూ సిబ్బంది తొలగించారు. అనంతరం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

2న గాజువాక పరసను ఘనంగా నిర్వహిస్తాం: 'పల్లా'

గాజువాక: పారిశ్రామిక ప్రాంతంలో అతి పెద్దదైన గాజువాక పరసను ఎంతో ఘనంగా నిర్వహిస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి రెండున గాజువాక పరసను ఏటా మాదిరిగా వైభవంగా జరుపుతామన్నారు. పరసకు భారీ సంఖ్యలో ప్రజలు రానున్నందున పటిష్ఠ ఏర్పాట్లు చేపడతామని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పిల్లా శంకరరావు, గోన శ్రీనివాసరావు, ప్రకాశ్‌రెడ్డి, వెంకటేశ్, రమణ, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



ముగ్గును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఓటర్లను చైతన్యపరిచేలా ముగ్గుల పోటీలు

గాజువాక, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గాజువాక హైస్కూల్‌లో విద్యార్థినులకు మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఓటర్లను చైతన్యపరిచేలా ముగ్గులను ఉపాధ్యాయులు వేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విజయప్రశాంతి మాట్లాడుతూ ఓటర్లను చైతన్యపరిచే విధంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న ఇల్లపు ప్రసాద్

అగనంపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మీ ప్రసాద్ మంగళవారం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పల్లా అభినందనలు తెలిపారు. కూటమి నాయకులను సమన్వయం చేసుకుని వార్డు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర, నాయకులు బి.సత్యనారాయణ, చందూరమేశ్, జిఅప్పారావు, రాజు, కోటి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు34, టమాటా 15, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 18, క్యారెట్ 38, దొండకాయలు 40, బంగాళదుంపలు 26, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 48, మునక్కాడలు (కిలో) 110, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 32, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 45, పొటల్స్ 80, కీరదోస 34, క్యాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 40, కంద 56, దేముడుచిక్కుడు 44, గోరుచిక్కుడు 34, ఆగాకార దేశవాళి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

ప్రజల కోసం అభివృద్ధి పనుల్లో రాజీ పడుతున్నా..

- వేపగుంట-పినగాడి రహదారిని 150 నుంచి 100 అడుగులకు తగ్గించాలని వీఎంఆర్డీఏకు నివేదించా
- పర్యాటక ప్రాంతంగా జామివాని చెరువును సుందరీకరిస్తాం
- ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పనులు చేయకపోతే ఎమ్మెల్యే అభివృద్ధి చేయడం లేదంటారు.. అభివృద్ధిలో భాగంగా రహదారుల విస్తరణ పనులు చేపడితే ప్రజలు వద్దని అడ్డుకుంటున్నారు.. నాకు ఓట్లు కావాలి, లేదంటే నన్ను ఓడిస్తారు.. అందుకే ప్రజల కోసం తాను రాజీపడాల్సి వస్తుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని రాంపురంలో థాన్ ఫౌండేషన్ సహకారంతో జామివాని చెరువు అభివృద్ధి సుందరీకరణ పనుల నిర్వహణపై మంగళవారం ఆయన ఆయకట్టు రైతులుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా విస్తరణకు నోచుకోని వేపగుంట-పినగాడి రహదారిని అభివృద్ధి పరిచే క్రమంలో 150 అడుగులకు విస్తరించేందుకు ప్రతిపాదన చేస్తే ప్రజలు వద్దంటున్నారన్నారు. ప్రజల అభిప్రాయం మేరకు విస్తరణ పనులను వందడుగులకు తగ్గించాలని తాను వీఎంఆర్డీఏకు విజ్ఞప్తి చేశానన్నారు. కొన్ని సందర్భాల్లో ఏదో చేద్దామన్న ప్రజాభిప్రాయం మేరకు అభివృదిలో రాజీ పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇది మంచి పరిణామం కాదని, అభివృద్ధిని అడ్డుకోరాదని హితవు పలికారు. జామివాని చెరువును సుందరీకరించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని, ఇందుకోసం అన్ని శాఖలను సమన్వయ పరుస్తామన్నారు. సాగునీటి చెరువు సంఘం అధ్యక్షుడు వెన్నెల రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీలు గండి హిమబిందు, జామి గంగునాయుడు, నాయకులు పిళ్లా జగన్మోహన పాత్రుడు, లాలం నరసింహమూర్తి, గండి భూషణం, కుచ్చు కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు. తొలుత పంచకర్ల రమేశ్‌బాబును ఘనంగా సత్కరించారు.

మరిడిమాంబ (కాకి అప్పన్న) పరసకు 88 ఏళ్లు

నేడు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి



మల్కాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంత ప్రజల ఇలవేల్పు మరిడిమాంబ (కాకి అప్పన్న) పరసను బుధవారం ఘనంగా జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 1937 నుంచి ఇక్కడ నిర్వహిస్తున్న అమ్మవారి పరసకు బుధవారంతో 88 ఏళ్లు పూర్తవుతాయి. మరిడిమాంబ పరస నిర్వహణ వెనక ఓ కథ ఉంది. 1927 ఏప్రిల్ రెండు నాటికి ఈ ప్రాంతంలో మల్కాపురంతో పాటు వాల్కంపేట, తెప్పరేవు, చింతలపాలెం గ్రామాలు ఉండేవి. అయితే ఆయిల్ కంపెనీలు, షిప్‌యార్డు నిర్మాణ సమయంలో ఆయా గ్రామాలను ప్రస్తుతం ఉన్న మల్కాపురానికి ప్రభుత్వ పెద్దలు తరలించారు. అప్పట్లో ఈ నాలుగు గ్రామాల ప్రజలు మరిడిమాంబ ఉత్సవాన్ని జరిపేవారు. ఈ క్రమంలో చింతలపాలేనికి చెందిన గ్రామ పెద్ద కాకి అప్పన్నరెడ్డి మృతి చెందడంతో ఆయన జ్ఞాపకార్థం ఏదైనా కార్యక్రమాన్ని నిర్వహించాలని భావించి 1937 జనవరి 22న కాకి అప్పన్న పేరిట మరిడిమాంబ పరసను నిర్వహించారు. అప్పటినుంచి ఏటా ఈ పరసను నిర్వహిస్తూ వస్తున్నారు. వాల్కంపేటలో పల్లీలు, తెప్పరేవులో జాలర్లు, చింతలపాలెంలో రెడ్డి కులస్తులు ఉండేవారు. మల్కాపురంలో మిగతా అన్ని కులాల వారు నివసించేవారు. కనుమ పండుగ ముగిసిన వారం రోజులకు మరిడిమాంబ (కాకి అప్పన్న) పరసను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. మరిడిమాంబ ఆలయ నిర్వహణ పనులను జాలర్లు, పరస నిర్వహణను రెడ్డి కులస్తులు చూస్తుంటారు. అమ్మవారి పండగను మాత్రం అన్ని కులాల వారు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. 1997లో హెచ్‌పీసీఎల్‌లో జరి గిన భారీ విస్ఫోటనానికి సంబంధించి 61 మంది కంపెనీలో మృత్యువాత పడ్డారు. ఆ సమయంలో నింగికెగసిన మంటలు మల్కాపురానికి తాకకుండా చూడాలని ప్రజలందరూ మరిడి మాంబను పూజించారు. దీంతో మల్కాపురాన్ని ఎలాంటి మంటలు తాకలేదు. అమ్మవారి ఆశీసుల వల్లే ఇది సాధ్యమైందని ప్రజల విశ్వాసం. అప్పటినుంచి అమ్మవారి పరసను మరింత వైభవంగా నిర్వహిస్తున్నారు.

వేకువజాము నుంచే అమ్మవారి దర్శనాలు

మరిడిమాంబ ఉత్సవంలో భాగంగా వేకువజాము ఆరు గంటల నుంచే అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుపుతారు. ఉదయం పది గంటలకు మల్కాపురం రెడ్డి వీధి నుంచి అమ్మవారి ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి పదిగంటల వరకు కోలాటాలు, సాముగారిడీలు, తప్పెటగుళ్లు, తదితర సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో పాటు బాణసంచా కాలుస్తారు. పరసలో ఎవరైనా దుకాణాల వద్దకు వచ్చి పండగ పేరు చెప్పి డబ్బులు అడిగినా, నగదు ఇవ్వాలని దౌర్జన్యం చేసినా మల్కాపురం పోలీసులకు లేదా 9393939461, 9177188336 సెల్ నంబర్లకు సమాచారం ఇవ్వాల్సిందిగా నిర్వాహకులు కోరారు.

రహదారి విస్తరణ వద్దంటూ ఆందోళన



రోడ్డు విస్తరణ పనులు నిలిపివేయాలంటూ సచివాలయం వద్ద నినాదాలు చేస్తున్న ఎస్ఆర్‌పురం గ్రామస్తులు

పెందుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఆర్‌పురంలో రహదారి విస్తరణ పనులు చేపడితే తాము ఆస్తులు కోల్పోయి తీవ్రంగా నష్టపోతామని, అందువల్ల పనులు నిలిపివేయాలంటూ మంగళవారం సర్పంచ్ దూది విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద ప్రజలు ఆందోళన చేశారు. వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం అడవివరం రోడ్డు నుంచి చెక్ పోస్టు రోడ్డు వరకు 200 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టనున్న నేపథ్యంలో ఎస్ఆర్‌పురంలో సుమారు 50 ఇళ్లను ప్రజలు కోల్పోనున్నారు. ఈ మేరకు సర్వే నంబర్ల వారీగా ఆస్తులు కోల్పోనున్న వారి వివరాలను సచివాలయం నోటీసు బోర్డులో పెట్టడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయకపోతే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. పేదల నివాసాలను తొలగించి అభివృద్ధి అంటారా అంటూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు దూది రమణ, కాయితీ ఎర్రిబాబు, తదితరులు పాల్గొన్నారు.



శోభాయమానంగా అలంకరించిన ఆలయం..పక్కన పూజలందుకున్న దానప్పతల్లి

వైభవంగా దానప్పతల్లి పరస

కూర్మన్నపాలెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి దుగ్గపువానిపాలెంలో మంగళవారం దానప్పతల్లి పరసను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, కొబ్బరాకులు, మామిడి తోరణాలు, వేపాకులు, అరటి గెలలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. కాళింగుల ఆరాధ్య దైవమైన దానప్పతల్లి అమ్మవారి దర్శనానికి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటాలు, తప్పెటగుళ్లు, చిడతలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, తదితర సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్థానిక నాయకులు డీవీ అప్పారావు, ప్రగడ వేణుబాబు, డి.దానప్పలు, బీఏ సత్యం, దామోదర్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

దొంకాడలో సీతారాముల..

అగనంపూడి: అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీ దొంకాడ రామాలయం వద్ద సీతారాముల పరసను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు సీతారాముల వారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటాలు, తప్పెడగుళ్లు, సాముగారిడీలు, బొమ్మల కొలువు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆలయ కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాథరావు, డి.సన్యాసిరావు, కె.శ్రీను, ఎ.అప్పారావు, బి.సత్తిబాబు, డి.నాయుడు, కె.పెంటారావు, సీహెచ్ దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

చింతల అగ్రహారంలో దుర్గమాంబ..

పెందుర్తి- రూరల్: మండలంలోని చింతల అగ్రహారం గ్రామస్తుల ఆరాధ్య దేవత దుర్గమాంబ పరసను వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని శోభాయమానంగా ముస్తాబు చేశారు. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో విచ్చేసి దుర్గమాంబను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, ఉప ఎంపీపీ దాడి వరలక్ష్మి, సర్పంచ్ దాడి గోపీ అప్పలనాయుడు, మాజీ సర్పంచులు ఆళ్ల తాతారావు, పి.అప్పారావు, పి.వెంకటరావు, మద్దాల శ్రీనివాసరావు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. కోలాటం ప్రదర్శనను వారు తిలకించారు. పరసలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఎట్టకేలకు పూర్తయిన తారురోడ్డు నిర్మాణం



అప్పన్నపాలెం-వాంబేకాలనీకి వేసిన రోడ్డు

వేపగుంట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు పరిధిలో అప్పన్నపాలెం నుంచి వాంబే కాలనీకి వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో రోడ్డు గోతులమయంగా ఉండడంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే ప్రజలతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఎక్కడికక్కడ రాళ్లు తేలివుం డడంతో వాహనదారులు నానాపాట్లు పడేవారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని జీవీఎంసీ అధికారులు సుమారు రూ.13 లక్షలు వెచ్చించి బీటీ రోడ్డు నిర్మించారు. రహదారి నిర్మాణంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కు భద్రతా విభాగాధిపతికి అభినందనలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ సేఫ్టీ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన ఎంఎస్ఎన్ రాజును విభాగం ఉద్యోగులు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. ప్లాంటుకు అత్యంత కీలకమైన భద్రతా విభాగానికి హెచ్‌వోడీగా బాధ్యతలు స్వీకరించడం గొప్ప విషయమని, ప్లాంట్ భద్రతకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరారు. ప్లాంట్‌ను ప్రమాదరహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అందరి కృషితో ముందుకు సాగుతానని రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు వరప్రసాదరావు, మిత్ర, పీఎస్ రావు, కృష్ణమూర్తి, ప్రసాద్, బయ్యే మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని ప్లాంట్ జీఎంకు వినతి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జీఎం (స్టీల్ అండ్ షైన్స్) పీఎస్ రావును ఇంటక్ నాయకులు కోరారు. ప్లాంటులో మంగళవారం జీఎంతో ఇంటక్ నాయకులు సమావేశమై పలు అంశాలను వివరించారు. సకాలంలో జీతాలు అందరక ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు విభాగాల్లో సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణ ప్రకటనతో ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు తగిన సౌకర్యాలు కల్పించాలని వేడుకున్నారు. జీఎంను కలిసిన వారిలో ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రాజు, నాయకులు కారు రమణ, సుబ్బయ్య, మద్ది అప్పలరాజు, అవతారం, తదితరులు ఉన్నారు.

పుణ్య ఫలదాయకం

త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం

- మహా కుంభమేళాకు భారీగా తరలివెళ్తున్న భక్తులు
- ఉత్తరాంధ్ర నుంచి రెండు లక్షల మంది వెళతారని అంచనా
- ఇప్పటికే 20 వేలమందికి పైగా పయనం



విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక పండగ మహా కుంభ మేళా. ఈ నెల 13న ప్రారంభమైన మేళా వచ్చే నెల 26 వరకు జరగనుంది. ప్రతిరోజూ లక్షలాది భక్తులు



పుణ్యస్నానాలను ఆచరిస్తున్నారు. కుంభమేళాకు ఉత్తరాంధ్ర నుంచి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తరలి వెళుతున్నారు. ప్రయాగ్‌రాజ్ చేరేందుకు రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులో ఉంచింది. గత వారం రోజుల్లో ఈ జిల్లా ల నుంచి 20 వేల మందికిపైగా భక్తులు మేళాకు వెళ్లినట్లు అంచనా. ఇంకా సమయం ఉండడంతో సుమారు మరో రెండు లక్షల మంది వెళతారని భావిస్తున్నారు.

- విశాఖ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు నడుస్తున్న రైళ్లు
- వచ్చేనెల 19 వరకు నిండిపోయిన బెర్తులు
- సంగమ ప్రదేశాల్లో ఏర్పాట్లపై సర్వత్రా సంతృప్తి

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు విశేష ప్రాధాన్యముంది. సాధారణ ప్రజలతో పాటు నాగ సాధువులు, అఘోరాలు ఇక్కడ పుణ్య స్నానాలను ఆచరిస్తున్నారు. పవిత్ర త్రివేణి సంగమంలో స్నానం చేస్తే జన్మ పునీతమవుతుందన్నది భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు ఆచరిస్తున్నారు.

ఇదీ చరిత్ర..

మహా కుంభమేళా విశిష్టతను చాటిచెప్పే ఇతివృత్తాలు ఎన్నో ఉన్నాయి. అమృతం కోసం దేవతలు, రాక్షసులు చేసిన క్షీరసాగర మదనానికి, కుంభమేళాకు సంబంధం ఉంది. క్షీర సాగర మదనం అనంతరం వెలువడిన అమృత భాండం రాక్షసులకు చిక్కకుండా మహా విష్ణువు మోహిని అవతారంలో తీసుకువెళ్తుండగా నాలుగు చుక్కలు హరిద్వార్, ప్రయాగ్‌రాజ్, ఉజ్జయిని, నాసిక్ క్షేత్రాల్లో పడ్డాయని చెబుతారు. ఈ నేపథ్యంలో వాటికి మహత్యం సిద్ధించిందని, ఈ క్షేత్రాల్లో పుణ్యస్నానాలు ఆచరిస్తే పునీతులువుతారని ప్రతీతి. గ్రహ భ్రమణాలను అనుసరించి 12 ఏళ్లకు ఒకసారి ఆయా చోట్ల మహా కుంభమేళా నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం జరుగుతున్న మహా కుంభమేళాకు మరింత ప్రత్యేకత ఉంది. 144 ఏళ్లకు ఒకసారి మాత్రమే ఈ మేళా నిర్వహిస్తారు. ఇది 12 పూర్ణ కుంభమేళాలతో సమానం. దీనిని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించడం ఆనవాయితీ.



స్నానానికి ప్రాధాన్యం..

కుంభమేళాలో చేసే పవిత్ర స్నానానికి ప్రాధాన్యం ఉంది. శుభ సమయాల్లో గ్రహాలు, నక్షత్రాల సంగమం పవిత్రజలంలో చేరుతుంది. ఈ సమయంలో స్నానాలు చేసిన వారికి ఆ అనుగ్రహం లభిస్తుంది. ఆరోగ్యం, ఐశ్వర్యంతో సహా ఎన్నో సత్ఫలితాలు లభిస్తాయని విశ్వాసం. కుంభమేళా స్నానాల్లో అత్యంత పవిత్రమైనది రాజస్నానం. ఈ నెల 13న పుష్యమి రోజు తొలి రాజస్నానం, 14న మకర సంక్రాంతి రోజు రెండో స్నానం జరిగాయి. ఈ నెల 29న మౌని అమావాస్య రోజున మూడో రాజస్నానం, ఫిబ్రవరి మూడున వసంత పంచమి రోజున నాలుగో రాజస్నానం, ఫిబ్రవరి 12న మాఘపౌర్ణమి సందర్భంగా ఐదో రాజస్నానం, ఫిబ్రవరి 26న మహా శివరాత్రి రోజున చివరి రాజ స్నానం చేస్తారు. ఆయా రోజుల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. తొలి రాజస్నానం రోజున సుమారు మూడు కోట్ల మంది భక్తులు స్నానాలు ఆచరించినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

చేరుకోవడం ఇలా..

విశాఖ నుంచి రైలు, విమాన మార్గంలో హైదరాబాద్, ఢిల్లీకి వెళ్లి, అక్కడి నుంచి ప్రయాగ్‌రాజ్ చేరుకోవచ్చు. ప్రయాగ్‌రాజ్ నుంచి పుణ్య స్నానాలు ఆచరించే (మహా కుంభ మేళా జరుగుతున్న ప్రదేశం) త్రివేణీ సంగమానికి (ఆరు కిలోమీటర్లు) చేరుకునేందుకు రైల్వేస్టేషన్‌లోని పోలీసు సిబ్బంది సహకరిస్తారు. మూడు కిలోమీటర్లు వరకు సాధారణ వాహనాల్లో చేరుకోవచ్చు. మిగిలిన మూడు కిలోమీటర్లు ఇ-రిక్షాల్లో వెళ్లాల్సి ఉంటుంది. లేదంటే జంక్షన్ నుంచి నేరుగా బైక్ ట్యాక్సీల్లో చేరుకోవచ్చు. ఇందుకు రూ.100 చొప్పున వసూలు చేస్తారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరే భక్తులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. చలి తీవ్రత ఎక్కువ. కాబట్టి ఉన్ని వస్త్రాలు వెంట ఉంచుకోవాలి. దుప్పట్లు తప్పనిసరి. కుంభమేళా జరుగుతున్న ప్రాంతాల్లో ఉచిత టెంట్‌లు అందుబాటులో ఉంటాయి. బెడ్‌తో కూడిన కొన్ని టెంట్‌లు అద్దెకు లభిస్తాయి. ఆహారం, నీటి వసతి ఉంది. పుణ్యస్నానాలు తరువాత నేరుగా ప్రయాగ్‌రాజ్‌కు చేరితే అక్కడ హోటల్స్ ఉంటాయి. ప్రయాగ్‌రాజ్ జంక్షన్ నుంచి వారణాసి వంద కిలోమీటర్లు. ఇక్కడి నుంచి 20 కిలోమీటర్ల దూరంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్ ఉంటుంది. ఇక్కడకు ప్రయాగ్‌రాజ్ నుంచి స్పెషల్ ట్రైన్ వస్తుంది. దాంట్లో విశాఖ చేరుకోవచ్చు. లేదా ప్రయాగ్‌రాజ్‌లో నుంచే తిరుగు ప్రయాణమయ్యే వీలుంది.

పూర్వ జన్మ సుకృతం



మహా కుంభమేళాలో పుణ్యస్నానం చేయడం పూర్వ జన్మ సుకృతం. ఈ అదృష్టం వస్తుందని ఊహించలేదు. ఢిల్లీ వరకు విమానంలో వెళ్లి అక్కడి నుంచి రైలులో ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నాం. ప్రయాణానికి రెండు వైపులా 30 గంటల చొప్పున పట్టింది. అక్కడ ఒకరోజు ఉన్నాం. ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయి. కోట్లాది మంది భక్తులు వస్తున్నారని భయపడాల్సిన అవసరం లేదు. ప్రశాంతంగా పుణ్య స్నానాలు ఆచరించేలా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ సిబ్బంది అడుగడుగునా సహకరిస్తున్నారు.

\- ఎం.వెంకటరావు, ధర్మశీల, విశాఖపట్నం

స్నానాలతో మరింత పుణ్యం



వృషభరాశిలో గురుడు, మకర రాశిలో రవి ఉన్న సమయం కావడంతో మహా పుణ్యకాలం. ఈ నెల 13 నుంచి వచ్చే నెల 26 వరకు ఉంటుంది. అందుకే మహా కుంభ మేళా నిర్వహిస్తున్నారు. ఈ కాలంలో త్రివేణి సంగమంలో స్నానాలను ఆచరిస్తే ఎంతో పుణ్యం పొందవచ్చు. ఈ నెలాఖరులో మాఘమాసం వస్తోంది. ఆ రోజుల్లో స్నానం చేస్తే మరింత ఫలం. అందుకే కోట్లాది భక్తులు వెళుతున్నారు. త్రివేణి సంగమంలో దానాలు, పితృ కర్మలు చేసినా ఫలిస్తాయి.

\- భోగారపు వాయునందన శర్మ, జయ కామాక్షి వైభవ పంచాయతన పీఠం

జన్మ ధన్యమైంది

మహా కుంభమేళాకు 20 మంది కుటుంబ సభ్యులు వెళ్లి రెండు రోజులున్నాం. త్రివేణీ సంగమంలో స్నానంతో జన్మ ధన్యమైంది. అక్కడి ఆధ్యాత్మిక వాతావరణం తన్మయత్వాన్ని కలిగిస్తుంది. భక్తుల్లో యువత అధిక సంఖ్యలో ఉండడం ఆశ్చర్యాన్ని కలిగించింది. హిందూ సంప్రదాయాలను గౌరవించే వారు పెరగడంతో ఆనందంగా ఉంది. ఏర్పాట్లు చాలా బాగున్నాయి. ఇబ్బందులు లేకుండా ఘాట్‌లు సిద్ధం చేశారు. ప్రభుత్వ సిబ్బంది, పోలీసులు సహకరిస్తున్నారు.

\- బద్దం రమేష్, భీమిలి

త్రివేణీ సంగమం వద్ద బద్దం రమేష్ కుటుంబసభ్యులు



ఆకాశవాణిలో కరస్పాండెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో పార్ట్ టైమ్ కరస్పాండెంట్ల(పీటీసీ)ను నియమించనున్నట్టు విజయవాడ ఆకాశవాణి యూనిట్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. జర్నలిజం చదవి, రెండేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులు. జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలోనే నివాసం ఉండాలి. 24 ఏళ్లు దాటి 50 ఏళ్ల లోపు వారు అర్హులు. ఏడాదికి రూ.12 లక్షలకు మించకుండా పారితోషికం ఇస్తారు. ఆసక్తి కలిగిన వారు ఫిబ్రవరి నాలుగో తేదీలోగా హెడ్ ఆఫీసు, ఆల్ ఇండియా రేడియో, ఎంజీ రోడ్, విజయవాడ 520010 చిరునామాకు దరఖాస్తులు పంపాలి.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన, మరికొన్ని రైళ్లకు తాత్కాలిక ప్రాతిపదికన అదనపు కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. జసిదిహ్-తంబరం ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 22 నుంచి, తంబరం-జసిదిహ్‌కు ఈ నెల 25 నుంచి శాశ్వత ప్రాతిపదికన జనరల్ సెకండ్ క్లాసు కోచ్, హటియా-ఎంఎంవీ బెంగళూరుకు మార్చి 3 నుంచి, తిరుగు ప్రయాణంలోని ఎస్ఎంవీ బెంగళూరుకు మార్చి 27 నుంచి శాశ్వత ప్రాతిపదికన రెండు జనరల్ సెకెండ్ క్లాసు కోచ్‌లను జత చేస్తారు. విల్లుపురం-ఖరగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 21 నుంచి ఫిబ్రవరి 18 వరకు, తిరుగు ప్రయాణంలో ఖరగ్‌పూర్-విల్లుపురం ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 20 వరకు తాత్కాలిక ప్రాతిపదికన తిరునెల్వేలి-పురిలియాకు 22 నుంచి ఫిబ్రవరి 19 వరకు, పురిలియా-తిరునెల్వేలికు ఈ 24 నుంచి ఫిబ్రవరి 21 వరకు తాత్కాలిక స్లీపర్ క్లాసు జత చేస్తామన్నారు.

గణతంత్ర వేడుకలకు ఎస్‌ఆర్‌పురం సర్పంచ్



ఎస్ఆర్‌పురం సర్పంచ్ దూది విజయలక్ష్మి

పెందుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈనెల 26న జరగనున్న గణతంత్ర వేడుకలకు మండలంలోని ఎస్ఆర్‌పురం సర్పంచ్ దూది విజయలక్ష్మి పాల్గొననున్నారు. ఈక్రమంలో ఆమెకు ఢిల్లీలో ఇండియన్ గేట్‌వే జరగనున్న పరేడ్‌కు వెళ్లనున్నారు. ఈ మేరకు పంచాయితీరాజ్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయి. రాష్ట్రవ్యాప్తంగా 25 మంది సర్పంచ్‌లు ఎంపిక కాగా వారిలో విశాఖ జిల్లా నుంచి ఎస్ఆర్‌పురం సర్పంచ్ విజయలక్ష్మికి స్థానం లభించింది.

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈనెల రెండో తేదీ నుంచి నిలిపివేసిన అప్పన్న ఆర్జిత సేవలను మంగళవారం పునఃప్రారంభించారు. సుప్రభాత సేవ, 4.30 గంటలకు ప్రభాత ఆరాధన, ఉదయం 8 గంటలకు గురుడసేవ, ఉదయం 8.30, సాయంత్రం 5.30 గంటలకు సహస్రనామార్చన, ఉదయం 9.30 గంటలకు నిత్య కల్యాణం, రాత్రి 7 గంటలకు ఆరాధన. ఉదయం 7 నుంచి రాజభోగం వరకు లక్ష్మీనారాయణుల వ్రతాలు, స్వర్ణ పుష్పార్చన, స్వాతి హవనం యథావిధిగా జరుగుతాయని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి, ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి నిత్య కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఉక్కు పరిశ్రమను కాపాడింది సీఎం చంద్రబాబే

- గనులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సంక్షోభం నుంచి కాపాడింది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడేనని గనులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ మేరకు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిందన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్లాంటు పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేసిందన్నారు. విశాఖలో రైల్వే జోన్ కార్యాలయానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు శరవేగంగా సాగుతున్నాయని, 37 శాతం రన్‌వే పనులు పూర్తయ్యాయన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు పునరుత్తేజం తెచ్చింది చంద్రబాబునాయుడు అని, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీ శ్రీభరత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కూటమి ఎంపీల కృషి మరువలేనిదన్నారు. ప్లాంటు పరిరక్షణకు నాలుగున్నరేళ్లపాటు కార్మికులు, నిర్వాసితులు చేసిన పోరాటం విస్మరించలేనిదన్నారు. కేంద్రం సహాయంతో రెండేళ్లపాటు స్టీల్ ప్లాంటును 99 శాతం సామర్థ్యంతో నడిపితే సెయిల్‌లో విలీనం చేయాలని కోరతామన్నారు. సొంత గనులు కేటాయిస్తే కష్టాలు తీరతాయన్నారు. ప్లాంటు ప్రైవేటీకరణ జరిగిపోతుందని వైసీపీ నేతలు అపోహలు సృష్టించారని ఆరోపించారు. ఆందోళన శిబిరం వద్దకు జగన్ ఎప్పుడైనా వెళ్లారా?...అని ప్రశ్నించారు. సమావేశంలో ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్లు గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ వైస్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర. చిత్రంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

చోరీల నియంత్రణకు ఇకపై డ్రోన్‌లతో గస్తీ

- 67 చోరీ కేసుల్లో రూ.90.53 లక్షల సొత్తు రికవరీ: సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో చోరీల నియంత్రణకు ఇకపై డ్రోన్‌లతో గస్తీ నిర్వహించనున్నట్టు పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి తెలిపారు. కమిషనరేట్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నగరంలో నిర్మానుష్య ప్రాంతాల్లో చోరీలు నమోదవుతున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగించి నిరంతర గస్తీ చేపడతామన్నారు. గత ఐదేళ్లతో పోల్చితే సంక్రాంతి సీజన్‌లో జరిగే చోరీల సంఖ్య ఈ ఏడాది తగ్గిందన్నారు. 2021 సంక్రాంతి సీజన్‌లో 12, 2022 సంక్రాంతికి ఎనిమిది, 2023లో తొమ్మిది, 2024లో 12 చోరీలు జరిగితే ఈ ఏడాది కేవలం మూడు చోరీలు జరిగాయన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న సైబర్‌నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా కళాశాలలు, ప్రైవేటు సంస్థలు, కార్యాలయాలు, పరిశ్రమలతోపాటు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సైబర్‌నేరాలు, డ్రగ్స్, లైంగిక వేధింపుల నుంచి రక్షణ పొందడంపై 'నవ జీవన నిర్మాణం' పేరుతో విద్యాసంస్థల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.గత ఏడాది డిసెంబరులో నగరంలో 116 చోరీ కేసులు నమోదయ్యాయని, వీటిని దర్యాప్తుచేసిన పోలీసులు 67 కేసులను ఛేదించారన్నారు. 91 మందిని అరెస్టుచేసి రూ.90.53 లక్షల సొత్తును రికవరీ చేశామన్నారు.వీటిలో 1,012.85 గ్రాముల బంగారం, 2.47 కిలోల వెండి, రూ.12.07 లక్షలు నగదు, పది బైక్‌లు, ఒక ఆటో, 14 సెల్‌ఫోన్లతో పాటు బాధితులు పోగొట్టుకున్న 315 సెల్‌ఫోన్లు ఉన్నాయన్నారు. సమావేశంలో క్రైమ్ డీసీపీ అనురాధ, సీఐలు జి.శ్రీనివాసరావు, కె.ఎర్రంనాయుడు పాల్గొన్నారు.



రికవరీ చేసిన సొత్తుతో సీపీ బాగ్చి, అధికారులు

క్రికెట్ బెట్టింగ్ కేసులో పెద్దచేపల కోసం గాలింపు: సీపీ

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో సంచలనం రేపిన క్రికెట్‌బెట్టింగ్ కేసుల్లో కీలక నిందితులు దొరకాల్సి ఉందని సీపీ శంఖబ్రతబాగ్చి అన్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో ఈనెల 12న పెదవాల్తేరులోని ఒక అపార్ట్‌మెంట్‌పై దాడిచేసి బుకీ లగుడు రవికుమార్‌ని అరెస్టు చేశామన్నారు. అతనివద్ద లభించిన ఆధారాలు, విచారణలో తెలిపిన సమాచారం ఆధారంగా ముఠా మూలాలను గుర్తించేపనిలో ఉన్నామన్నారు. ఇప్పటివరకూ ఎనిమిదిమంది బుకీలను అరెస్టు చేయగా, మంగళవారం మరో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. పెద్దచేపలను పట్టుకోవడంలో భాగంగా దర్యాప్తు వివరాలనుగోప్యంగా ఉంచుతున్నామన్నారు. బుకీలు అత్యాధునిక పరికరాలు, యాప్‌లను ఉపయోగించడంతో కేసు దర్యాప్తుని సైబర్‌క్రైమ్ విభాగానికి అప్పగించామన్నారు. పరారీలో ఉన్న వారికోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయన్నారు. బుకీలకు రాజకీయనేతలు, పోలీస్‌శాఖలోని కొందరి అండదండలు ఉన్నాయనే ఆరోపణలపై ఇప్పుడే వాటిపై స్పందించలేనన్నారు. నిందితుల బ్యాంకు ఖాతాలు, సెల్‌ఫోన్ కాల్ డేటాను విశ్లేషించి దర్యాప్తులో ముందుకు వెళ్లాల్సి ఉండడంతో క్లిష్టంగా మారిందన్నారు.

యువకుడి ఆత్మహత్య



వలీసా మృతదేహం

పెందుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి సమీపంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తిలోని పెద్ద చెరువు వద్ద యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహం వద్ద లభించిన ఆధారాలను బట్టి విజయనగరం జిల్లా సాలూరు సమీపంలోని జీగిరాం గ్రామానికి చెందిన పఠాన్ వలీసా (25)గా గుర్తించారు. మృతదేహం సమీపంలో పురుగుల మందు సీసా లభించడంతో దానిని తాగి ఉంటాడని భావిస్తున్నారు. మృతుని కుటుంబీకులకు సమాచారం అందించారు. సాలూరు నుంచి ఇక్కడకు ఎందుకు వచ్చాడు? ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, సీఐ సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగ బాలికపై అత్యాచారం

భీమునిపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన 12 ఏళ్ల మానసిక దివ్యాంగురాలిపై ఓ వ్యక్తి (52) అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నతనం నుంచి ఆమెకు మానసిక స్థితి బాగాలేకపోవడంతో పాటు పోలియోతో మంచంపైనే ఉంటోంది. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్తుండగా, నాన్నమ్మ బాలికకు రక్షణగా ఉంటుంది. మంగళవారం ఉదయం నాన్నమ్మ సమీపంలో వున్న గొర్రెల వద్దకు వెళ్లగా అదే అదనుగా నిందితుడు ఇంట్లోకి ప్రవేశించాడు. బాలిక నాన్నమ్మ తలుపులు దగ్గరగా వేసి వున్నట్టు గమనించి, ఇంటికి వచ్చి తలుపు తెరవగా నిందితుడు దారుణానికి ఒడిగట్టడాన్ని చూసి కేకలువేసింది. వెంటనే విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుధాకర్, ఎస్ఐ హరీశ్ సంఘటనా స్థలికి చేరుకుని బాధితురాలితో మాట్లాడారు. నార్త్ ఏసీపీ అప్పలరాజు సంఘటనా స్థలికి చేరుకున్నారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని, ఫోక్సో చట్టం కింద కేసునమోదు చేశామని, ఏసీపీ అప్పలరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారని సీఐ సుధాకర్ తెలిపారు. బాలికను వైద్య పరీక్షలకు కేజీహెచ్‌కు తరలించామని చెప్పారు.

బాలికపై అత్యాచారం: యువకుడి అరెస్టు

ఎండాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పీఎంపాలెం పరిధిలో 15 ఏళ్ల బాలికపై యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని అరెస్టు చేశారు. వివరాలు తెలియాల్సి ఉంది.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎండాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కందిపల్లి శ్రీనివాసరావు (48) విజయనగరంలోని వుడా కాలనీలో కుటుంబంతో కలిసి నివస్తున్నాడు. ఆయన నగరంలోని ఆర్కియాలజీ విభాగంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ప్రతిరోజూ ద్విచక్ర వాహనంపై విధులకు వచ్చి వెళ్తుంటారు. మంగళవారం విధులకు వస్తుండగా పీఎంపాలెం వైజాగ్ కన్వెన్షన్స్ సమీపంలోని విజయశ్రీ ఆసుపత్రి వద్ద వెనుక నుంచి కారు బలంగా ఢీకొంది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాస్ భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో అంతర్గత బదిలీలు

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) అంతకంటే కిందిస్థాయిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి అంతర్గత బదిలీలు చేస్తూ జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జోన్-1 ఈఈగా కాపులుప్పాడ డంపింగ్‌యార్డు డీఈ కె. దిలీప్‌ను జోన్-1తోపాటు జోన్-5ఏ ఇన్‌చార్జి ఈఈగా బదిలీచేశారు. జోన్-8, మెకానికల్ ఈఈగా ఎస్. చిరంజీవులును జోన్-4 ఈఈగా, జోన్-5ఏ, 5.బీ ఈఈ తారాప్రసన్నను జోన్-5బీ పరిమితం చేశారు. జోన్-4 ఈఈ పి. శ్రీనివాసప్రసాద్‌ను నీటిసరఫరా విభాగానికి అక్కడి ఈఈ సీహెచ్ ఏడుకొండలను, జోన్-1, జోన్-3 ఈఈగా, స్ట్రీట్ లైటింగ్, నీటిసరఫరా (ఎలక్ట్రికల్) ఈఈగా డి.శ్రీధర్‌ను ఎలక్ట్రికల్ విభాగానికి బదిలీచేశారు. డీఈలు, ఏఈలతోపాటు ఇన్‌చార్జి వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, ఏఈలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వార్డు ఎమినిటీ సెక్రటరీలను కూడా వివిధ వార్డులకు బదిలీ చేశారు.

సముద్రంలో లైట్ ఫిషింగ్‌పై నిషేధం

- మత్స్యకారులకు అవగాహన కల్పించిన అధికారులు

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో రాత్రిపూట లైట్లు వేసి చేపలను వేటాడకూడదని, దానిపై ప్రభుత్వం నిషేధం విధించిందని మత్స్యశాఖ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం మత్స్యకారులకు అవగాహన కల్పించారు. సైంటిస్ట్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ తాబేళ్లు వలలకు చిక్కుకుంటున్నాయని, అవి సురక్షితంగా బయటకు వెళ్లేపోయేందుకు వీలుగా ప్రభుత్వం 'టెడ్' పరికరాలను అందిస్తున్నదని, వాటిని ప్రతి ఒక్కరూ వినియోగించాలని సూచించారు. రాత్రిపూట లైట్లు వేయడం వల్ల చేపల ప్రవర్తనలో మార్పులు వచ్చి మత్స్య సంపద తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. జోనల్ డైరెక్టర్ భామిరెడ్డి మాట్లాడుతూ, విశాఖ తీరంలో ప్రమాదకరమైన ప్రాంతాలు, చిరిగిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల మత్స్య సంపదపై దుష్ప్రభావాలు వివరించారు. జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఒడిశాలో హర్మిత సముద్ర ప్రాంతం, దివి, రుషికుల్య, ధామ్ర నదీ ముఖద్వార ప్రాంతాలను 'నో ఫిషింగ్ జోన్'గా ప్రకటించారని, అటు వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో మర పడవల యజమానులు, సంఘాల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు

ఇంధన రంగంలో పెట్టుబడులపై సదస్సు

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇంధన రంగంలో పెట్టుబడులపై అవగాహన కల్పించడానికి హోటల్ గ్రీన్‌పార్కులో మంగళవారం సదస్సు నిర్వహించారు.స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ నిర్వహించిన ఇన్వెస్టిమెంట్ బజార్ ఫర్ ఎనర్జీ ఎఫిషియెన్సీ సదస్సుకు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ రంగంలో ఏపీలోనే 2031 నాటికి రూ.8వేల కోట్ల పెట్టుబడులు వస్తాయన్నారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రం, డీఈలు పద్మజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.